అగ్రనేత
తెలుగు దిన పత్రిక
TELTEL/2015/66279
రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :86 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: మంగళవారం 03-06-2025 పేజీలు:4 వెల: 2.00

## అమెరికాలో కాల్పుల మోత.. యూదులపై ఫైర్ బాంబు దాడి

వాషింగ్టన్: అమెరికా వీధులు మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లాయి. లాస్ ఏంజెలెస్‌తోపాటు నార్త్ కరోలినాలో దుండగులు కాల్పులకు పాల్పడగా, కొలరాడోలో యూదులపై ఓ వ్యక్తి బాంబు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనల్లో ముగ్గురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. నార్త్ కరోలినాలోని హికోరిలో ఓ ప్రైవేట్ ప్రాపర్టీలో జరిగిన కాల్పుల్లో ఒకరు మృతిచెందగా, 11 మంది గాయపడ్డారు. అదేవిధంగా లాస్ ఏంజెలెస్ నగరంలోని బాల్డివన్ పార్క్‌లో గుర్తు తెలియని వ్యక్తి తుపాకీతో కాల్పులకు దిగాడు. దీంతో ఓ పోలీసు అధికారి మరణించాడు. మరొకరు గాయపడ్డారు. అనంతరం అధికారులు మరో మృతదేహాన్ని గుర్తించారు. కొలరాడోలో యూదులపై ఓ వ్యక్తి బాంబు దాడికి పాల్పడ్డాడు. పాలస్తీనాకు విముక్తి కల్పించాలంటూ మండే స్వభావం కలిగిన ద్రావణ సీసాలను విసిరాడు. దీంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పాలస్తీనాకు విముక్తి కల్పించాలంటూ నినాదాలు చేశారు. అనుమానితుడు మహమ్మద్ సబ్రీ సోలిమాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఈ ఘటనను ఉగ్రదాడిగా అభివర్ణించారు.

# తెలంగాణను ప్రేమించడంలో ఎప్పుడూ ముందున్నాం



డాలస్: నాలుగు కోట్ల మంది కోసం మహాత్ముని స్ఫూర్తిగా తెలంగాణ కలగన్న కేసీఆర్.. ఒకే ఒక్కడిగా బయల్దేరారని, ఎన్నో అవమానాలను అధిగమించి తెలంగాణను సాధించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (%ఖు=%) అన్నారు. ఎంతో మంది ప్రాణత్యాగాలు చేస్తే.. దశాబ్దాలుగా కొట్లాడితే తెలంగాణ వచ్చిందని చెప్పారు. పోరాడి సాధించిన యోధుడు ముఖ్యమంత్రిగా ఉండటంతో అదే కసి.. స్ఫూర్తితో పనిచేశామన్నారు. 2023లో ఓడిపోయినా తెలంగాణను ప్రేమించడంలో ఎప్పుడూ ముందున్నామని చెప్పారు. మూడేండ్లలో కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారని వెల్లడించారు. అమెరికాలోని డాలస్ నగరంలోని డాక్టర్ పెప్పర్ ఎరీనాలో రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు, బీఆర్ఎస్ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఎన్నారైలు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంర్భంగా మాట్లాడుతూ.. ' మిమ్మల్ని చూసి తెలంగాణ గడ్డ గర్విస్తున్నది. ఖండాలను దాటి తెలంగాణ నైపుణ్యాన్ని చాటిన మీ అందరికీ వందనం. తెలంగాణకు ప్రతీకగా నిలిచిన మీ అందరికీ అభివందనం. అమెరికాలోని తెలంగాణ వాసులను చూసి తెలంగాణ తల్లి గర్విస్తున్నది. పుట్టిన గడ్డకు వేలాది మైళ్ల దూరంలో ఉన్నా బతుకమ్మను మరచిపోలేదు. బతుకును ఇచ్చిన తెలంగాణను మీరు మరచిపోలేదు. దశాబ్ద కాలంగా ఎలాంటి ఉత్సాహం కనిపించిందో ఇప్పుడూ అలాగే కనబడుతున్నది. నిన్నటి వరకు తెలుగు వారికి రెండు రాష్ట్రాలే ఉన్నాయి అనుకున్నా.. కానీ నాకు నిన్ననే అర్థం అయింది మనకి రెండు కాదు మూడు రాష్ట్రాలు ఉన్నాయని.. అది టెక్సాస్‌లో ఉందని.అమెరికాలో ఉన్నట్లు ఎంతమాత్రం అనిపించడం లేదు. 2015లో పెట్టుబడుల కోసం అమెరికాలో తిరుగుతూ డాలస్‌కు వచ్చాం. పదేండ్ల తర్వాత ఇక్కడకు వచ్చి చూస్తే కేసీఆర్ దూతలుగా ఎన్నో చేసి చూపించారు. జీవితంలో ఎన్నో కలలు కంటారు. కొందరు వాటిని సాకారం చేసుకుంటారు. 2001లో నాలుగు కోట్ల మంది కోసం మహాత్ముని స్ఫూర్తిగా కేసీఆర్ తెలంగాణ కలగన్నారు. ఒకే ఒక్కడిగా బయల్దేరారు. ఉద్యమం నుంచి తప్పుకుంటే రాళ్లతో కొట్టండన్నారు. శూన్యం నుంచి బయల్దేరి అందరినీ ఏకం చేసి తెలంగాణను సాధించారు. విదేశీ గడ్డపైనా జై తెలంగాణ అని నినదించారు. ఎన్నో అవమానాలను అధిగమించి తెంగాణను సాధించారు. మేం బాధ్యతగా భావించడంతోనే అనితర సాధ్యమైన విజయాలు చేకూరాయి. స్వరాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా నిలుపుకోవడంలో ఏ అవకాశాన్ని వదులుకోలేదు. 2023లో ఓడిపోయినా తెలంగాణను ప్రేమించ డంలో ఎప్పుడూ ముందున్నాం. మళ్లీ మూడేండ్లలో తిరిగి బిడ్డ తెలంగాణ తల్లి వద్దకు చేరుతుంది. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. ఎంతో మంది ప్రాణత్యాగాలు చేస్తే.. దశాబ్దాలుగా కొట్లాడితే తెలంగాణ వచ్చింది. పోరాడి సాధించిన యోధుడు ముఖ్యమంత్రిగా ఉండటంతో అదే కసి.. స్ఫూర్తితో పనిచేశాం.

**అదే తెలంగాణ స్టైల్..**

2014 జూన్ 2న అసాధ్యమైనది సుసాధ్యం చేసిన రోజు. 60 ఏండ్ల కల నిజమైన రోజు. దశాబ్దాల ఆశయాలు, ఆశలు, ఆకాంక్షలు.. కలలు ఫలించిన రోజు. అసాధ్యాలను సుసాధ్యం చేయడమే తెలంగాణ స్టైల్. అసంభవం అనుకున్న ఎన్నో కార్యాలను సంభవం చేసి చూపించింది తెలంగాణ, దేశానికి దిక్సూచిగా మారింది. దశాబ్దాలుగా స్థిరపడ్డ పెద్ద పెద్ద రాష్ట్రాలను తలదన్నేలా అనతికాలంలోనే అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. పదేండ్ల పాలనలో వలసలను నివారించి విముక్తికలిగించాం. కేసీఆర్ ఆలోచనలు, ఊహలు కొందరికి అతిశయోక్తిగా అనిపించవచ్చు. ఉద్యమ సమయంలోనే తెలంగాణను ఓ రూపంగా నిలుపుకున్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందింది. తెలంగాణ అద్భుతమైన అక్షయపాత్రగా అవతరించింది. తలసరి ఆదాయం రూ.1.12 లక్షల నుంచి రూ.3.56 లక్షలకు చేరింది. దేశంలోనే ఆర్థికాభివృద్ధిలో నంబర్‌వన్‌గా నిలిపాం. 8 ఏండ్లలోనే 10 శాతం పేదరిక నిర్మూలన జరిగింది. అప్పులు చేసి ఆదాయాన్ని పోగుచేసి పేదలకు, ప్రజలకు పంచాం. ఎప్పుడూ మితిమీరి అప్పులు చేయలేదు. ఆర్థిక క్రమశిక్షణ వల్ల అప్పుల్లో కింది నుంచి ఆరో స్థానంలో ఉన్నాం. కరోనా కాలంలోనూ తెలంగాణను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాం. ఆనాడు కరెంటు కోతలతో ప్రజలు సతమతమయ్యారు. విద్యుత్ సంస్కరణలు చేపట్టి సమస్యను పరిష్కరించాం.

**45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే అక్షయ పాత్ర కాళేశ్వరం**

కేసీఆర్ విప్లవాత్మకమైన అద్భుతమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టారు. తుంగతుర్తి, డోర్నకల్, మహబూబ్‌సాగర్‌కు నీళ్లు వచ్చాయంటే కాళేశ్వరం వల్లనే. నాలుగేండ్లలోనే కాళేశ్వరం నిర్మించిన ఘటన కేసీఆర్‌కు దక్కుతుంది. 45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే అక్షయ పాత్ర కాళేశ్వరం. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 19 రిజర్వాయర్లు. 371 పిల్లర్లలో 2 పిల్లర్లు కుంగితే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని విషప్రచారం చేశారు. మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేసి వాడుకలోకి తేవాలని కోరుతున్నా. కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడుభూములకు సైతం నీళ్లు మళ్లించాం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 10 శాతం పనులు మిగిలిపోతే పూర్తిచేయడం లేదు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే మిగిలిన పనులను పూర్తి చేయడం లేదు. కోటిన్నర ఎకరాల్లో పంటలను పండించి వ్యవసాయ విస్తరణ సాధించాం. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హర్యానాలను తలదన్ని తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. తెలంగాణలో సంపద పెరిగింది.

# రాష్ట్రాన్ని పునర్నిర్మించే దిశగా అడుగులు.. రాష్ట్ర అవతరణ వేడుకల్లో సీఎం రేవంత్



హైదరాబాద్,తాము అధికారం చేపట్టేనాటికి తెలంగాణలో వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రస్తుతం రాష్ట్రాన్ని పునర్ నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేసిన పార్టీ అధినేత్రి సోనియాగాంధీకి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పదేళ్లుగా నిర్వీర్యమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి మహిళా శక్తి తొలి ప్రాధాన్యమన్నారు. మహిళా సాధికారితే ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉపాధి, విద్యార్థుల యూనిఫామ్‌లు తయారీ వారికే అప్పగించామన్నారు. తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరు మీద ఇస్తున్నట్లు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వం ధ్యేయమన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. ధరణి కొందరికి చుట్టమైతే, భూభారతి ప్రజల రక్షణ చట్టమన్నారు. కేవలం ఏడాదిలో 60 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని, పెట్టుబడుల ద్వారా లక్షమందికి ఉపాధి కల్పించామన్నారు. ఉద్యోగ భర్తీతో నిరుద్యోగుల విశ్వాసాన్ని చూరగొన్నామన్నారు. యంగ్ ఇండియా పాఠశాలల ద్వారా విద్యార్థులకు నైపుణ్యాలు పెంచడమే తమ ధ్యేయమన్నారు. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ లేకపోవడం బాధాకరమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ అని మరోమారు క్లారిటీ ఇచ్చారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. విద్య మీద పెట్టే డబ్బు ఖర్చుకాదని, భవిష్యత్‌కు పెట్టుబడిగా వర్ణించారు సీఎం రేవంత్ రెడ్డి. పేదల ఆరోగ్యమే మా ప్రభుత్వ బాధ్యత అని చెబుతూనే, ఆసుపత్రుల్లో మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. 2,700 కోట్ల రూపాయలతో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నట్టు తెలిపారు. పదేళ్ల కిందట దేశంలో కుల గణన జరిగిందని, దేశంలో తొలిసారి తెలంగాణలోనే కులగణన జరిగిందన్నారు ముఖ్యమంత్రి. 56 శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్రం నిర్ణయించిందని, కులగణన విషయంలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రపంచంతో తెలంగాణ పోటీ పడేలా పాలసీ తీసుకొస్తున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు. మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అని అన్నారు. న్యూయార్క్, టోక్యోతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఫోర్త్ సిటీ రానుందన్నారు. అలాగే పెట్టుబడులకు ఫ్యూచర్ సిటీ కేంద్రబిందువు కానుందన్నారు. హైదరాబాద్ ను మరింత తీర్చిదిద్దేందుకు జపాన్ సహకరిస్తుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ ఎంత అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసన్న ముఖ్యమంత్రి, రీజినల్ రింగ్ రోడ్డుతో రాష్ట్ర రూపురేఖలు మారిపోతాయన్నారు. మెట్రో విస్తరణ లేకపోవడం వల్ల హైదరాబాద్ 9వ స్థానానికి పడిపోయిందన్నారు. త్వరలో మెట్రోను విస్తరించి అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. దేశంలోనే నెంబర్ పోలీసింగ్ వ్యవస్థ తెలంగాణలో ఉందన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో తెలంగాణ పోలీసులే నెంబర్ వన్ అని ప్రస్తావించారు. ముఖ్యంగా డ్రగ్స్ ను నియంత్రించడంలో రాష్ట్ర పోలీసులకు అవార్డు వచ్చిందన్నారు. ఇటీవల నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీల గురించి మాట్లాడారు. 108 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ పోటీల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మందికి కోటి రూపాయల నగదు పురస్కారం అందజేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పెరేడ్ గ్రౌండ్స్‌లో వారికి నగదు పురస్కారం అందజేశారు. వారిలో గద్దర్ కూతురు విమలమ్మకు కోటి అందజేశారు. ఎక్కా యాదగిరి రావు, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరికి ఈ పురస్కారాన్ని అందజేశారు. దివంగత గూడ అంజయ్య, బండి యాదగిరి నగదు పురస్కారాన్ని అందుకున్న వారిలో ఉన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజు సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై ప్రకటన చేశారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరపున ఆయన కూతురు పురస్కారాన్ని అందుకున్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది పోలీస్ అధికారులకు మెడల్ ఫర్ గ్యాలంట్రీ ఇచ్చారు. దీని కింద ఆ పదకొండు మందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులను అందజేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

# ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని లంచం అడిగేవారిని పట్టిస్తే రూ.25 వేల బహుమానం




హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు వరంగా మారింది. నిరుపేదలకు సొంతింటి కల నెరవేరబోతోంది. ఇప్పటికే పలు జిల్లాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇదే అదునుగా భావించిన కొందరు కేటుగాళ్లు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు కాజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని లంచం అడిగేవారిని తనకు పట్టిస్తే పార్టీ నుంచి రూ. 25వేలు బహుమానంగా ఇప్పిస్తానని తెలిపారు. అలాగే సదరు వ్యక్తిని పార్టీ నుంచి బహిష్కరిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హంటర్‌రోడ్డులోని అభిరామ్ గార్డెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి పారదర్శకంగా అర్హులకే అందజేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కరికైనా ఇల్లు మంజూరు చేసిందా అని ప్రశ్నించారు. అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఒర్వడం లేదన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని, అందులో 660 పత్రాలు ఇచ్చామని, త్వరలో మిగతావి అందజేస్తానని చెప్పారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు 3వ తేదీన ముగ్గుపోసుకుని నిర్మాణాలు ప్రారంభించి దావత చేసుకుని తనను ఆహ్వానిస్తే ఆనందంగా వస్తానని తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయకుండా వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల పని పడతానని, 15 రోజుల్లో అర్హులకు వాటిని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

# 'తెలంగాణలో ఏపీ తరహా వ్యూహం..



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేయని వ్యాపారం లేదు.. దోచుకోని సంస్థ లేదంటూ కాంగ్రెస్ నాయకులు మధు యాష్కీ సంచలన ఆరోపణలు చేశారు. బంగారు బతుకమ్మ పేరుతో కోట్ల రూపాయలు సంపాదించారు. తెలంగాణ జాగృతిలో 800 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. ఇదే సమయంలో ప్రధాని మోదీ, అమిత్ షా ఆదేశాల మేరకు కవిత పనిచేస్తున్నారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ తాజాగా మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ..'బీజేపీ వదిలిన బాణమే కవిత. ఒక మహిళగా రాష్ట్రంలోనే కాదు.. ఢిల్లీలో కూడా ఆమె కుంభకోణం చేశారు. తన అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే కొత్త డ్రామాకు తెర లేపారు. తెలంగాణ జాగృతిలో భారీ స్కాం జరిగింది. జాగృతిపై విచారణ జరపాలి. రాజీవ్ ప్రతాప్ రుడి పదవి పోవడానికి జాగృతి సంస్థ కారణం. జాగృతి సంస్థ అవినీతిలో కూరుకుపోయింది. తెలంగాణలో చనిపోయిన రైతులకు ఆర్థిక సహాయం చేస్తామని కార్పొరేట్ సంస్థల దగ్గర జాగృతి డబ్బులు వసూలు చేసింది. జాగృతి దోపిడీకి అన్ని కార్పోరేట్ సంస్థలు బలయ్యాయి. కవిత మాఫియా డాన్. ఆమె చేయని వ్యాపారం లేదు.. దోచుకోని సంస్థ లేదు. కవిత ఏ వ్యాపారం చేసిందని జూబ్లీహిల్స్‌లో రెండు వేల కోట్ల ఆస్తులు వచ్చాయి. మోదీ, అమిత్ షా ఆదేశాల మేరకు కవిత పనిచేస్తుంది. బీఆర్ఎస్ స్థానాన్ని బీజేపీ పొందాలనుకుంటుంది.. అందుకే కవితను రంగంలోకి దింపింది. లిక్కర్ కేసు నుండి బయటపడటం కోసం కవిత బీజేపీకి పనిచేస్తోంది. అవినీతి సొమ్ము దాచుకోవడానికే జాగృతి బలోపేతం అంటుంది. బీసీలకు న్యాయం చేస్తా అన్న కవిత.. జాగృతికి ఎందుకు అధ్యక్షురాలిగా ఉంది. జాగృతి అధ్యక్షురాలిగా బీసీ, ఎస్సీ, ఎస్టీకి ఎందుకు అవకాశం ఇవ్వడం లేదు. నిస్వార్థంగా తెలంగాణ కోసం పనిచేసింది జయశంకర్.. కేసీఆర్ కాదు. ముఖ్యమంత్రి పదవి కోసమే కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో చేరాడు. పదేళ్లు కేసీఆర్ కుటుంబం దోపిడిలో ఏంతో మంది బలయ్యారు. ఎంపీ సంతోష్ ఇప్పుడు ఎందుకు చెట్లు నాటడం లేదు.. పదేళు చెట్ల పేరుతో సంతోష్ కోట్ల రూపాయలు దోచుకున్నాడు. కేటీఆర్‌కు అమెరికాలో పెట్టుబడులు ఉన్నాయి. వాటి లెక్కలు చూసుకోవడానికే కేటీఆర్ అమెరికాకు వెళ్లారు. ఏపీ తరహా వ్యూహాన్ని బీజేపీ తెలంగాణలో అమలు చేస్తుంది. ఏపీలో టీడీపీ, బీజేపీ తిట్టుకున్నాయి.. ఎన్నికల నాటికి రెండు కలసి పోటీ చేశాయి. తెలంగాణలో కూడా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయి' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల, నా తెలంగాణ కోటి రతనాల వీణ ..



హైదరాబాద్,జూన్ 2, 2025 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ ఏర్పడి నేటితో 11 యేళ్లు పూర్తి చేసుకొని 12వ యేట అడుగుపెట్టింది. మన దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ తర్వాత మనదేశంలో కొత్తగా మరే రాష్ట్రం ఏర్పడలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజునే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం మనకు తెలిసిందే. అయితే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలకి పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు తన శుభాకాంక్షలను తెలియజేస్తూ.. "తెలంగాణ నా ఉద్యమానికి పునాది" అని పేర్కొంటూ రాష్ట్ర ప్రజల మనసులను గెలుచుకున్నారు. ఆయన తన ట్వీట్‌లో జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల, నాకు పునర్జన్మను ఇచ్చిన నేల, నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల, నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ. మూడున్నర కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు, దశాబ్దాల పోరాటాలకు ప్రతిరూపంగా, విద్యార్థులు, యువత బలిదానాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని రంగాలలో సంక్షేమాభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని పవన్ కళ్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇక దశాబ్దాల కాలపు కొట్లాటకు, నాలుగు కోట్ల ప్రజల తండ్లాటకు విముక్తి లభించిన రోజు నేడు. సుదీర్ఘ స్వప్నం.. సాకారమైన సుదినం నేడు. 'తెలంగాణ వచ్చుడో ..కేసీఆర్ సచ్చుడో..కేసీఆర్ శవయాత్రో..తెలంగాణ జైత్రయాత్రో' అంటూ నినదించిన కేసీఆర్ గారు గమ్యాన్ని ముద్దాడే వరకు విశ్రమించలేదు. సబ్బండ వర్గాలు ఏకమై గర్జించి, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాట ఫలితం తెలంగాణ..రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు అని హరీష్ రావు రాసుకొచ్చారు.

# కాంగ్రెస్ విమర్శలపై స్పందించిన శశిథరూర్.. ఏమన్నారంటే..!



న్యూఢిల్లీ,కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. కేంద్రం నియమించిన దౌత్య బృందానికి నాయకత్వం వహించారు. పాకిస్థాన్ వైఖరిని విదేశాల్లో ఎండగట్టేందుకు అధికార-ప్రతిపక్ష ఎంపీల బృందాలను విదేశాలకు పంపించింది. ఇక కాంగ్రెస్‌ను సంప్రదించకుండానే ఆ పార్టీ ఎంపీ శశిథరూర్‌ను కేంద్రం నియమించడంపై వివాదం చెలరేగింది. ఇక విదేశాల్లో భారత్ తరపున పాకిస్థాన్ వైఖరిని విదేశీ నాయకులకు వివరించారు. ఆయన మాటలను కాంగ్రెస్ తప్పుపట్టింది. తాజాగా కాంగ్రెస్ విమర్శలపై శశిథరూర్ స్పందించారు. అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్యంలో విమర్శలు తప్పకుండా ఉంటాయని.. ఈ సమయలో వాటి గురించి ఆలోచించలేమని.. వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదని చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్ర దాడి జరిగి 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం భారత్.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఇక పాకిస్థాన్.. ఉగ్రవాదాన్ని ఎలా పెంచి పోషిస్తుందో ప్రపంచానికి తెలియజేయా లని కేంద్రం నిర్ణయించింది. ఏడు దౌత్య బృందాలను ఏర్పాటు చేసి విదేశాలకు పంపించింది. ఇందులో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఒక బృందానికి నాయకత్వం వహించారు. న్యూయార్క్ పర్యటనలో ఉండగా శశిథరూర్ మాట్లాడుతూ.. తాను ప్రభుత్వానికి కాదు.. ప్రతిపక్ష పార్టీకి పని చేస్తున్నట్లు తెలిపారు. అయితే పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత భారత్ ప్రతీకార దాడులకు దిగిందని.. అదే యూపీఏ హయాంలో అలా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలే కాంగ్రెస్ నేతలకు కోపం తెప్పించింది. ఆ పార్టీ నేత పవన్ ఖేరా.. శశిథరూర్ వ్యాఖ్యలను ఖండిం చారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో కూడా సర్జికల్ స్ట్రైక్ జరిగాయని గుర్తుచేశారు. చౌకబారు రాజకీయాలు చేయడానికే శశిథరూర్‌ను కాంగ్రెస్ ఉపయోగించుకుంటోందని జైరాం రమేష్ మండిపడ్డారు. ఇక మరో నాయకుడు ఉదిత్ రాజ్ స్పందిస్తూ.. శశిథరూర్‌ను బీజేపీ సూపర్ ప్రతినిధిగా నియమించాలని సూచించారు. శశిథరూర్ నాలుగుసార్లు కాంగ్రెస్ నుంచి తిరువనంతపురం నుంచి ఎంపీగా గెలిచారు. కానీ కాంగ్రెస్‌తో సరైన సంబంధాలు లేవు. ఈ మధ్య కాలంలో బీజేపీతో కలిసి మెలిసి ఉంటున్నారు. ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు. ఇక కేరళ అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్నాయి.

## సంపాదకీయం

**మంగళవారం 03-06-2025**

# తెలంగాణ గుండెపై గులాబీ కుంపటి !

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్÷-లో కూడా తెలంగాణ ఎప్పుడూ ఇంతగా దోపిడీకి గురికాలేదు. ఉమ్మడి ఏపిని పాలించిన నేతలు ఎప్పుడూ ఇంతగా అడ్డంగా తెలంగాణను దోచుకోలేదు. అలాగే రాష్ట్రం అప్పులపాలు కాలేదు. ఒక్క కుటుంబం గుప్పిట్లోనే అధికారం ఉండిపోలేదు. ప్రజల ధనమానప్రాణాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం చేతిలో దగాపడ్డది. దోపిడీకి గురయ్యింది. ఇది ముమ్మాటికీ నిజం. కళ్లకు కనిపిస్తున్న నిజం. తెలంగాణ కోసం రోడ్డున పడ్డ ఎందరో మోసపోయారు. ఓ కుటుంబ తెలంగాణను అప్పులపాటు చేసి, తమ బతుకుల బాగుచేసుకుని దర్జాగా వెలుగుతోంది. ఇంతగా డబ్బులు ఎక్కడివి. తెలంగాణను దోచుకున్నారని బిజెపి అంటోంది. కాంగ్రెస్ అంటోంది. కానీ దోపిడీని రుజువు చేసి ఆ కుటుంబ ఆస్తులను జప్తు చేసే కార్యక్రమం మాత్రం జరగడం లేదు. కాళేశ్వరం కెసిర్‌కు ఎటిఎం లాగా మారిందని ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు పదేపదే ఆరోపించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. అంటే రాజకీయ పార్టీలన్నీ ఒక్కటే. పరస్పరం దూషించుకుంటాయే తప్ప తప్పులు చేసిన వారిని దోషిగా నిలబెట్టలేరు. కెసిఆర్ కుటుంబం ఉద్యమకారులకు ద్రోహం చేసింది. ప్రాణాలు త్యాగం చేసిన కుటుంబాలను మోసం చేసింది. అప్పులు చేసి ప్రజలను కూడా దగా చేసింది. ఇంతగా తెలంగానను దోపిడీ చేసిన పార్టీ టిఆర్ఎస్, బిఆర్ఎస్ తప్ప మరోటి కాదు. ఇప్పుడు ఆ పార్టీలో అధికారం కోసం లేదా పెత్తనం కోసం జరుగుతున్న పోరాటమే కవిత తిరుగుబాటు తప్ప మరోటి కాదు. ఇది ఏమాత్రం ప్రజలకు సంబంధం లేనిది. ఇకపోతే సొంత ఇల్లునే చక్కబెట్టుకోలేని కెసిఆర్ గత పదేళ్లుగా తెలంగాణను ఎలా పాలించారో తెలుసు కోవచ్చు. ఆయన ఓ అసమర్థ నేత అని అప్పుడూ.. ఇప్పుడూ రుజువు అవుతోంది. సిఎంగా కెసిఆర్ ప్రజలను ఎందుకు కలవాలని, తండ్రిని ఇంట్లోనే మూలన కూర్చుండబెట్టిన కెటిఆర్ పెత్తనం చేసేందుకు చేసిన ప్రయత్నాలే ఇప్పుడు పంచాయితీకి కారణమని భావించాలి. కెసిఆర్ నాయకత్వాన్ని కెటిఆర్ గుప్పిట్లో పెట్టుకున్న కారణంగానే సహించలేక సోదరి కవిత తిరుగబాటు ప్రకటించింది. ఇక్కడ తనకూ కొంత పెత్తనం దక్కక పోవడంతో పాటు, ఉమ్మడి ఆస్తుల విషయంలోనూ పంచాయితీ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఎన్నికల్లో అధికారం కోల్పోయాక అసెంబ్లీకి రాకుండా, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా కెసిఆర్ చేసిన తప్పిదం వల్ల కెటిఆర్ చెలరేగి పోతున్నారు. ఇప్పుడు ఆయన కెసిఆర్ నాయకత్వాన్ని సవాల్ చేసే విధంగా తనకు అనుకూలంగా కోటరీని మలచుకున్నారు. పార్టీని తన గుప్పిట్లో పెట్టుకున్నారు. హరీష్ రావును దూరం పెట్టారు. ఇదో రకంగా కెసిఆర్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని కవిత ఇప్పుడు చెప్పడం కాదు..ఎప్పుడో జరిగింది. బిఆర్ఎస్ కోసమే ఎంపి ఎన్నికల్లో సైలెంట్ అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కేసుల భయంతోనే ఇదంతా చేస్తున్నారని ప్రజలు ఎప్పుడో గమనించారు. లిక్కర్ కేసులో అడ్డంగా బుక్కయిన కవిత ఇప్పుడు నీతులు మాట్లాడితే ప్రజలు నమ్మరు. ఈ కుటుంబంలో అందరూ అవినీతిపరులే అనడానికి ఎలాంటి సందేహం అక్కర్లేదు. తమ కులం వారికే పదవులు కట్టబెట్టడం, తెలంగాణతో సంబంధం లేని వారికి అధికారాలు కట్టబెట్టడం,కాంట్రాక్టులు కట్టబెట్టడం, తెలంగాణ పోరాటం చేసిన వారిని దూరం పెట్టడం అన్నీ ఓ క్రమపద్ధతిలో తమ దోపిడీకి అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలే అని చెప్పకతప్పదు. జయశంకర్ సార్ నుంచి కోదండరామ్ సార్ వరకు అందరూ దగాపడ్డవారే. ఎందుకంటే బిఆర్ఎస్ అన్నది కేవలం ముగ్గురు వ్యక్తుల ఆధిపత్యంలో నడిచింది. కెసిఆర్, కెటిఆర్, కవితలే దానికి బాస్‌లు. మిగీ ఎవరున్నా వారంతా పైకి కనిపించే డమ్మీలే. తనకు, కేసీఆర్ మధ్య దూరం పెంచే కుట్ర జరుగుతోందని కవిత అంటున్నారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభమో అందరికీ తెలుసునని, కావాలనే తనను ఎంపీ ఎన్నికల్లో ఓడించారని కూడా కవిత భగ్గుమన్నారు. ప్రజలను వెన్నుపోటు పొడిచిన వారికి కటుఉంబంలో కూడా వెన్నుపోట్లు పొడవడానికి వెరవరని కవిత వ్యాఖ్యలే చెబుతున్నాయి. తెలంగాణను అడ్డంగా నిలువునా దోచుకున్న తరవాత ఇప్పుడు కవిత సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానని అంటే నమ్మడానికి తెలగాణ ప్రజలు సిద్దంగా లేరని గుర్తించడం మంచిది. దోచుకుంది చాలు. ఇక సొంత రాజకీయాలు తేల్చుకుని తెలంగాణను ప్రశాంతంగా బతకనీయాలి. ఎందుకంటే కెసిఆర్ కుటుంబం చేసిన అప్పుల కారణంగా తెలంగాణ వందేళ్లు వెనక్కి పోయింది. బంగారు తెలంగాణ అంటూ కెసిఆర్ తన కుటుంబాన్ని 24 క్యారట్ల గోల్డ్‌గా మార్చుకున్నారు. ఈ క్రమంలో తాజా ఎపిసోడ్ అన్నది కేవలం అధికారం కోసం రాజకుటుంబంలోజరిగే పోరాటం లాంటిదే. సొంత కుటుంబ సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారని చెప్పక తప్పదు. అధికారంలోకి వచ్చేందుకే ఇలాంటి కుతంత్రాలకు వారు తెగగబడతారని కూడా అనుకోవాలి. ఉద్యమకారుల గొంతులను కొడుకు, బిడ్డలు కోశారు. అందులో కవిత పాత్ర కూడా ఉంది. ఎంతో మంది రాజకీయ జీవితాలతో ఆడుకున్న కుటుంబం వాళ్లది. సొంత కుటుంబాన్ని మేనేజ్ చేసుకోలేని వ్యక్తి కెసిఆర్. అలాంటి కెసిఆర్ తెలంగాణను మళ్ళీ ఎలా పాలిస్తారని ప్రశ్నించుకోవాల్సిన సమయమిది. కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం ఉంటే తెలంగాణ నాశనం అవుతుందని రుజువు అయ్యింది. కాళేశ్వరం లాంటి పనికి రాని ప్రాజెక్టులు కట్టి.. అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారు. అధికారం లేకపోతే ఒక్క నిముషం కూడా ఉండలేని కుటుంబం అని.. తేల్చేసారు. సొంత కుటుంబం సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకోవడానికి వెనకాడరని కవిత రుజువు చేశారు. అందుకే కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదన్నది నూటికినూరుపాళ్లు నిజం. టీఆర్ఎస్ పెట్టడానికి, అధికారంలోకి రావడానికి కృషి చేసిన వేలమంది గొంతులు తడిగుడ్డతో కోసిన చరిత్ర కల్వకుంట్ల కుటుంబానిది. అధికారం కోసం మాత్రమే వీరు రాజకీయం చేస్తున్నారు.కేసీఆర్‌ను మరోసారి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరని తేలింది. కాంగ్రెస్ విఫలం అయితే...ప్రజలు మరో ప్రత్యామ్నాయం చూసుకుంటారే తప్ప కెసిఆర్‌ను, ఆయన కుటుబాన్ని మాత్రం ఇక నమ్మరు.


# విచారణ వేళ.. విలీనం గోల!



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు చూసి పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'హమ్మయ్య బతికిపోయాను' అని కచ్చితంగా అనుకుంటూ ఉంటారు. ఈ వారంలో మూడు రోజులపాటు జరిగిన ఆయన పార్టీ మహానాడులో చంద్రబాబు నాయుడు తన ఏకైక కుమారుడు లోకేష్‌ను దాదాపుగా తన వారసుడిగా ప్రకటించినంత పనిచేశారు. ఎప్పుడో ఒకప్పుడు లోకేష్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తారన్న ప్రచారం కొంతకాలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ మూడు రోజుల మహానాడులో అప్పుడెప్పుడో 1996లో మరణించిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ఆత్మ చేత కూడా లోకేష్ కు ఆశీర్వాదాలు ఇప్పించారు. ఇది చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు సామాజిక మాధ్యమాల్లో నవ్వులపాలు కావడానికి ఉపయోగపడిందే తప్ప పెద్దగా ప్రయోజనం లేకపోయింది. 1996లో తన మరణానికి కొన్ని గంటల ముందు మాట్లాడిన పత్రిక గోష్ఠిలో కూడా ఎన్‌టి రామారావు చంద్రబాబు నాయుడుని ఎంత తీవ్రంగా ద్వేషించారో పత్రికల వాళ్లంతా చూసారు. అలాంటి ఎన్‌టి రామారావు మాట్లాడినట్టుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఒక వీడియోను సృష్టించి అందులో చంద్రబాబు నాయుడు పరిపాలనను, లోకేష్ సామర్థ్యాన్ని ఎన్‌టిఆర్ గొంతుతో ప్రశంసింపజేసి తండ్రీకొడుకులు నవ్వులపాలయ్యారు. ఎన్‌టి రామారావు బొమ్మతో ప్రజలలోఓట్లు సాధించుకోవడానికి ఆయన నామస్మరణ చేస్తున్నారే తప్ప ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వం వహిస్తున్న పార్టీ అసలు తెలుగుదేశం పార్టీ కాదు. ఎందుకంటే ఎన్‌టి రామారావు మరణంతోటే తెలుగుదేశం పార్టీ అనేది అంతరించిపోయింది. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు హరికృష్ణ ప్రారంభించిన అన్న తెలుగుదేశం పార్టీ, ఆయన భార్య లక్ష్మీపార్వతి కొనసాగించిన ఎన్‌టిఆర్ టిడిపి ఎంత ఘోరంగా విఫలమయ్యాయో చూసాం. ఎన్‌టి రామారావు పేరు వాడుకుంటున్న చంద్రబాబు నాయుడు పార్టీ ఇతరేతర కారణాలవల్ల, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన చనిపోయిన తర్వాత గెలిచిన మూడు సందర్భాల్లో అంటే 1999, 2014, 2024.. ఈ మూడు సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి కారణం ఒంటరిగా కాకుండా రెండు మూడు పార్టీలను కలుపుకుపోవడమే. చంద్రబాబు నాయుడు నాయకత్వం వహిస్తున్న పార్టీకి స్వతంత్ర శక్తి లేదు. మొన్నటి మహానాడులో దేశంలో ఏ పార్టీకీ లేని విధంగా కోటిమంది సభ్యులు తమకు ఉన్నారని చెబుతున్నప్పటికీ పదేపదే 'కూటమిగా మూడు పార్టీలు కొనసాగాల్సిందే, వచ్చే అనేక ఎన్నికల్లో మనందరం కలిసి ఉండాల్సిందే' అంటూ రాగాలు తీశారు. ఏ రాజకీయ పార్టీ అయినా స్వతంత్రంగా ఎదిగి ప్రజల మన్నన పొంది అధికారంలోకి వచ్చి పరిపాలన చేయాలనుకోవాలి కానీ వాళ్లను వీళ్లను కలుపుకుంటే తప్ప గెలవలేమనే అభిప్రాయం పార్టీ శ్రేణులకు, ప్రజలకు కలిగించిన తరువాత ఇక ఆ పార్టీకి జనంలో విలువ ఏముంటుంది?సరే, తెలంగాణలో చేతులెత్తేసి పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయిన పార్టీ గురించి ఇప్పుడు ఇక్కడ మాట్లాడుకోవడం ఎందుకంటే ప్రస్తుతం తెలంగాణలో ఒక ప్రధాన రాజకీయ పక్షంలో జరుగుతున్న వారసత్వ పోరాటం కారణం. అందుకే చంద్రబాబు నాయుడు తెలంగాణ రాజకీయాలు, ఇక్కడ జరుగుతున్న వారసుల కొట్లాటలు చూసి 'హమ్మయ్య, బతికిపోయాను.. నాకు ఒక్కడే కొడుకు, హాయిగా అతనికి పగ్గాలు అప్పచెప్పేయొచ్చు' అని సంతోషపడుతుండవచ్చు. తెలంగాణ విషయానికొస్తే భారత రాష్ట్ర సమితిలో అధినేత చంద్రశేఖరరావు కుమార్తె కవిత చేసిన తిరుగుబాటు నిన్నమొన్నటిదాకా టీ కప్పులో తుపానులా సమసిపోతుందని చాలామంది అనుకున్నారు. కవిత అమెరికానుండి తిరిగివచ్చిన తరువాత ఈ రెండు మూడు రోజుల్లో జరిగిన పరిణామాలవల్ల ఇదంత సులభంగా పరిష్కారమయ్యే సమస్య కాదని అర్థం అయింది.అక్కడ చంద్రబాబు ఆనందపడుతూ ఉంటే, ఇక్కడ చంద్రశేఖరరావు ఆందోళనలో పడ్డారు. దీనంతటికీ పరిష్కారం నిజానికి ఆయన చేతుల్లోనే ఉంది. కొడుకు, కూతురు మధ్య తలెత్తిన నాయకత్వ వివాదాన్ని ఆ పార్టీలో ఆయన తప్ప ఇంకెవరు పరిష్కరించలేరు. కూతురిని పిలిచి కూర్చోబెట్టి మాట్లాడవచ్చు, సముదాయించవచ్చు లేదా కోప్పడి దారికి తెచ్చుకోవచ్చు. కొడుకుకు సంబంధించిన వాళ్లంతా సామాజిక మాధ్యమాల్లో రెచ్చిపోయి చేస్తున్న ప్రచారాల్ని కొడుకుకే చెప్పి ఆపించవచ్చు. రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, పార్టీ మరో శ్రేయోభిలాషి గండ్ర మోహన్ రావు వంటివారిని కెసిఆర్ కవిత దగ్గరికి పంపించడంలోనే దీనికి ఫుల్ స్టాప్ పెట్టాలనే ఆలోచనలో ఆయన లేరనే అర్థం ఉన్నది. ఎందుకంటే కవిత లేవనెత్తిన అంశాలు ఇటువంటి మధ్యవర్తుల రాయబారంతో పరిష్కారం అయ్యేవి కాదు. అధినేత స్వయంగా పూనుకోవాల్సిందే. కానీ ఆయన ఆ పని చేయడం లేదు. ఈలోగా 'తండ్రికి వారసుడు కొడుకే.. ఆయనే సమర్థుడు' అన్న విధంగా కెటిఆర్ అభిమానగణం చేస్తున్న హడావుడి పార్టీకి మరింత నష్టం చేస్తుందనే ఆందోళన ఆ పార్టీ అభిమానుల్లో వ్యక్తం అవుతున్నది.కవిత మే 2న లేఖ రాసిన తర్వాత అది 20 రోజుల అనంతరం లీక్ కాకుండా ఉంటే ఎలా ఉండేదో తెలియదుగాని, ఆ లీక్ చేసినవాళ్లు ఏ ప్రయోజనం ఆశించినా జరిగింది మాత్రం నష్టమే. లేఖ లీక్‌తో కవిత పూర్తిగా బయటపడ్డారు. చాలామంది ఈ లేఖ తాను రాసింది కాదని కవిత ఖండిస్తారని అనుకున్నారు. అలా జరగకపోగా ఆమె తన లేఖను లీక్ చేసిన దయ్యాల మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడితో ఆగకుండా కవిత సింగరేణి కార్మికుల మధ్య పని చేయడం కోసం గతంలోనే పార్టీ ఏర్పాటు చేసిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి పోటీగా సింగరేణి జాగృతి అనే సంస్థను ప్రకటించి దానికి అన్ని డివిజన్ల కో ఆర్డినేటర్లను కూడా నియమించారు. బయటికి ఎన్ని మాట్లాడినా ఇది పార్టీని సవాల్ చేయడమే అవుతుంది. అంతేకాదు, ఆమె శుక్రవారం నాడు రెండు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పర్యటించి అక్కడా ధిక్కారస్వరమే వినిపించారు. 'నేను పార్టీని విడిచిపెట్టలేదు, విడిచిపెట్టను. కెసిఆరే మా నాయకుడు' అని చెబుతూనే కవిత శనివారంనాడు తన నివాసం సమీపంలోనే జాగృతి పేరిట కార్యాలయాన్ని ప్రారంభించుకున్నారు. అంటే ఇక ఆమె పార్టీ అధికారిక కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు వెళ్లబోరని సంకేతాలు ఇచ్చినట్టే. లేదా ఆమెను తెలంగాణ భవన్‌కు వెళ్ళకుండా ఆ దయ్యాలు కట్టడి చేసినందునే ఆమె వేరే కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారా?పార్టీలోని కొంతమంది బిఆర్ఎస్‌ను భారతీయ జనతా పార్టీలో కలిపేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రతిపాదనను తాను వ్యతిరేకిస్తున్నానని కవిత ప్రతిచోటా నొక్కి చెబుతున్నారు. తాను జైలులో ఉండగానే బిఆర్ఎస్- బిజెపి విలీనం ప్రతిపాదనను తనవద్దకు తీసుకువచ్చారని, తాను దాన్ని నిరాకరించారని అంటున్నారు. ఒకవేళ చంద్రశేఖరరావు సీరియస్‌గా తను పార్టీ నడపలేనని అనుకుని బిజెపిలోనో, ఇంకో పార్టీలోనో విలీనం చేయాలనుకుంటే కవిత వద్దంటే ఆగుతుందా? భారతీయ జనతా పార్టీ మీద కవితకు కోపం, వ్యతిరేకత ఉండడం సహజం. కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డియే కనుసన్నలలో నడిచే కేంద్ర దర్యాప్తు సంస్థలు తనను మద్యం కుంభకోణంలో నిందితురాలిగా చేర్చి ఆరు మాసాలపాటు జ్యుడీషియల్ రిమాండ్ కు వెళ్లేట్టు చేసినందుకు ఆగ్రహం ఉండొచ్చు. అసలు కెసిఆర్ గాని, భారత రాష్ట్ర సమితిలోని ఇతర ఏ నాయకులు గానీ 24 సంవత్సరాలపాటు అస్తిత్వంలో ఉన్నఒక ఉద్యమ సంస్థనుంచి బలమైన రాజకీయపక్షంగా రూపొంది రెండు పర్యాయాలు ప్రజాతీర్పు పొంది అధికారంలో ఉన్న పార్టీని అంత ఆషామాషీగా ఓ జాతీయ పార్టీలో కలిపేసే ఆలోచన చేస్తారా? 2014 ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రకటన రాగానే లేదా పార్లమెంట్లో ఆమోదం పొందగానే టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసి ఉంటే అది వేరు. అప్పటిదాకా కెసిఆర్ ఆ మాట చెబుతూ వచ్చారు కూడా. కానీ ఆ తరువాత ఆయన ఎప్పుడూ ఇలాంటి ఆలోచన చేసినట్టుగా దాఖలాలు లేవు, అవసరం కూడా రాలేదు. మరి ఎందుకు పదేపదే బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తారనే చర్చ జరుగుతున్నది? అటువంటి అభిప్రాయం కలగడానికి లేదా ఆలోచన రావడానికి ఒక కారణం ఉండొచ్చు. అధికారం కోల్పోయిన తర్వాత కవితతోసహా కొందరు ఆ పార్టీ నాయకులు కేంద్ర దర్యాప్తు సంస్థల కేసులలో ఇరుక్కోవడమే ఆ కారణం. ఈ కేసులన్నీ నిజమేనా? రుజువు అవుతాయా లేదా? అనేది కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు తమ వైరిపక్షాల మీద ఇప్పటివరకూ పెట్టిన కేసుల పరిస్థితి చూస్తూనే ఉన్నాం.భారత రాష్ట్ర సమితికి సంబంధించి కవిత ఇప్పటికే మద్యం కేసులో కొద్ది మాసాలు జైలుకు వెల్లి ఉన్నారు. కెటి రామారావు మీద రాష్ట్ర ప్రభుత్వంలోని అవినీతి నిరోధక శాఖ చేస్తున్న దర్యాప్తు, దానితోపాటు ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా అదే కేసులో తాను చేరడం, సాక్షాత్తూ పార్టీ అధినేత చంద్రశేఖరరావుకు కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నుండి పిలుపు రావడం.. ఇవన్నీ చికాకు పరచి రక్షణకోసం పార్టీని బిజెపిలో కలపాలని ఆలోచన చేస్తున్నారా అన్న చర్చ జోరుగా సాగుతున్నది. మరి అదే నిజమైతే కవిత భిన్నస్వరం ఎందుకు వినిపిస్తున్నట్టు? నిజానికి కేంద్ర దర్యాప్తు సంస్థ కారణంగా ఇప్పటికయితే ఆమే కదా ఇబ్బంది పడ్డది?ఏదిఏమైనా ఒకవైపు కెసిఆర్, మరోవైపు సీనియర్ నాయకుడు, కెసిఆర్ కు అత్యంత విశ్వాసపాత్రుడు హరీశ్ రావుతో కలిసి కాళేశ్వరం కమిషన్ ఎదుటకు వెళ్లేందుకు అవసరమైన వాదనలను సిద్ధం చేసుకున్న తరుణంలో కవిత పార్టీ అగ్రనేతకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని ఆక్షేపిస్తూ జూన్ 4వ తేదీన ఇందిరా పార్క్ దగ్గర ధర్నా నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. మరి ఆమె జిల్లాల పర్యటనకు వెళ్ళినప్పుడుగాని, ఇతరత్రా కార్యక్రమాల్లోగాని పార్టీ వారెవరూ పాల్గొనకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న ఆమె వ్యతిరేకులు.. నాలుగవ తేదీన ధర్నాకు కూడా ఎవరినీ వెళ్లకుండా కట్టడి చేస్తారా? ఆమె భారత రాష్ట్ర సమితి శాసనమండలి సభ్యులుగా ఇంకా ఉన్నారు. మరి పార్టీ పేరు మీద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారా లేక తెలంగాణ జాగృతి పేరిట ముందుకు పోతారా చూడాలి. శనివారం నాటి కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంలో మాట్లాడుతూ కవిత అనేక అంశాలను ప్రస్తావించి, జాగృతి వాటన్నిటి మీదా పోరాటం చేస్తుందని చెప్పారు. మరి దేవుడు కెసిఆర్ నాయకత్వంలోని పార్టీని ఈ అంశాల మీద పోరాటం చెయ్యలేని నిర్వీర్య స్థితిలో దయ్యాలు పడేసాయనుకోవాలా? పార్టీనుండి కవిత బహిష్కరణకు రంగం సిద్ధమవుతోందన్న వాదన ఒకవైపు, కవిత సొంత పార్టీ ఏర్పాటుకోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారనే వాదన మరోవైపు వినిపిస్తున్నాయి.

# విజయవంతంగా ముగిసిన కెటిఆర్ యుకె పర్యటన

హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు యుకె పర్యటన విజయవంతంగా ముగిసింది. ఇంగ్లాండ్ గడ్డపై తెలంగాణ విజయగాథను కెటిఆర్ అద్భుతంగా వినిపించారు. అధికారం కంటే పుట్టిన గడ్డ మీదనే తనకు మమకారం ఉంటుందని ఈ పర్యటనలో సమున్నతంగా చాటారు. ఈ నెల 27న యుకెలో అడుగుపెట్టిన కెటిఆర్‌కు స్వాగతం పలకడానికి తెలంగాణ ఎన్.ఆర్.ఐలు భారీగా తరలివచ్చారు. కెటిఆర్ మాస్కులు ధరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గుండె సంబంధిత ఆపరేషన్ తరువాత కోలుకుంటున్న బిఆర్ఎస్ ఎన్.ఆర్.ఐ నాయకుడు, ఫిలిం డెవలప్ మెంట్ కార్పోరేషన్ మాజీ ఛైర్మెన్ అనిల్ ఇంటికి ఎయిర్ పోర్ట్ నుంచే నేరుగా వెళ్లి కెటిఆర్ ఆయనను పరామర్శించారు.మలిదశ ఉద్యమంలో దశాబ్దకాలం కాలం పాటు ఇంగ్లాండ్ గడ్డపై తెలంగాణవాదాన్ని వినిపించిన అనిల్‌ను ఆప్యాయంగా పలకరించి కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. 28 తేదీన బిఆర్ఎస్ ఎన్.ఆర్.ఐ కార్యవర్గం, సీనియర్ నేతలతో లండన్‌లో సమావేశమైన కెటిఆర్, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలతో పాటు భవిష్యత్తులో నిర్వహించాల్సిన కార్యక్రమాల పైన చర్చించారు. 30వ తారీఖున బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో ప్రధాన ఉపన్యాసం ఇచ్చిన కెటిఆర్,ఆర్థిక రంగాన్ని స్థిరమైన వృద్ధితో నడిపించడంలో ప్రపంచానికి తెలంగాణ ఎలా దిక్సూచీగా మారిందో అద్భుతంగా వివరించారు. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ సంస్థలకు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్



సేవలను అందించే పిడిఎస్ఎల్ సంస్థ నాలెడ్జ్ సెంటర్‌ను వార్విక్ యూనివర్సిటీలో మే 31 నాడు కెటిఆర్ ప్రారంభించారు. యుకె పర్యటన సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు.

దలాస్‌లో కెటిఆర్‌కు ఘనస్వాగతం

యుకె పర్యటన ముగించుకొని అమెరికాలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబరాలలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు కెటిఆర్ యుకె నుంచి అమెరికాలోని డల్లాస్‌కి బయలుదేరి వెళ్లారు. డాలస్‌కు చేరుకున్న కెటిఆర్‌కు బిఆర్ఎస్ ఎన్ఆర్ఐ యుఎస్ఏ విభాగం ప్రతినిధులతో తెలంగాణ ఎన్ఆర్ఐలు, ముఖ్యనాయకులు,మాజీ మంత్రులు,ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.

# గుదిబండ పథకాలకు పాతరేయాలి

హైదరాబాద్, ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిన క్రమంలో ఇప్పటికే జీతాలకు, పెన్షన్లకు కష్టంగా మారింది. పథకాల అమలు కూడా భారంగా మారబోతున్నది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెటీలు కూడా ఆర్థికంగా ఇరుకున పెట్టేవే. వాటిని అమలు చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విపక్షఆలు ఆరు గ్యారెంటీలపై నిలదీస్తున్నాయి. అయినా అవి సానుకూలమైతేనే ముందుకు సాగాలి. ముఖ్యంఆ ఆర్టీసికి గుదిబండా మారిన ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి మహాలక్ష్మి పథకాన్ని కేవలం పేదలకు మాత్రమే పరిమితం చేయాలి. మిగతా వారికి అర్ధను బట్టి డబ్బులతో కూడా పాస్‌లు అందచేయాలి. దుబారా పథకాలను పక్కన పెట్టే నిర్ణయాలను రేవంత్ సర్కార్ తీసుకోవాలి. ఈ విషయంలో ఎంతటి కష్టమైనా నిర్దయగా వ్యవహరించాలి. రూపాయి బియ్యం పథకాన్ని సమీక్షించాలి. రేషన్ కార్డుదారుల్లో సగం మంది అనర్హులు ఉన్నారు. వారిని గుర్తించి ఏరిపారేయాలి. అలాగే రూపాయికే కిలో బియ్యాన్ని సమీక్షించాలి. కనీసం పదిరూపాయలకు కిలో బియ్యం అందించడం ద్వారా ఆర్థిక భారాన్ని తప్పించుకోవచ్చు. దుబారాను అరికట్టవచ్చు. ఈ క్రమంలో పథకాలను సమీక్షించుకుని కఠిన నిర్ణయాలతో ముందుకు సాగాలి. ప్రధానంగా జిల్లాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు ఆర్థికంగా భారంగా మారింది. అలాగే అడ్డదిడ్డంగా మారింది. 10 జిల్లాలు ఉన్న తెలంగాణను పాలనా వికేంద్రీకరణలో భాగంగా 33 జిల్లాను చేశారు. వీటి సంఖ్యను కుదించాలి. మరీ జిల్లాల సంఖ్యపెరగడంతో కలెక్టర్ల ప్రాధాన్యత తగ్గింది. దేశంలో ఇంతటి అరుదైన నిర్ణయం తెలంగాణలో మాత్రమే జరిగింది. ఆశలను కల్పించడం వేరు.. వాటిని సాకారం చేయడం వేరు. తెలంగాణ కలను సాకారం అయిన సందర్భంలో జిల్లాల విభజన అన్నది పద్దతి ప్రకారం జరగలేదు.ఇలా అనేక విషయాలను సమీక్షించుకుంటే తప్ప ముందుకు సాగడం కష్టం. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఒక్కో హామీని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తూనే, ఆర్థికంగా నిలదొక్కుకోగలగాలి. ప్రజలు భాగస్వాములైతే తెలంగాణ పురోభివృద్ధి లో కీలకం కానుంది. ఇక మరో విశేషమేమంటే సమైక్య రాష్ట్రం అవసరాలకు అనుగుణంగా రూపొందించిన అనేక పథకాలను, చట్టలాను మార్పు చేసుకుంటే తెలంగాణ అస్తిత్వానికి అనుగుణంగా సాగగలదు. పేదలు కూడా గౌరవంగా బతికేలా అందరికీ ఇళ్లు కట్టించే ఆలోచన మంచిదే. అయితే ప్రజలు స్వయం సమృద్దితో ఎదిగిలే పథకాలు రూపొందించాలి. రెండు పడకగదుల ఇళ్లు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిలో కొత్త ఆశలు చిగురింపజేశాయి. అయితే అది సాకారం కాలేదు. ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు అలా కాకుండా చూసుకోవాలి. ఇదే సందర్భంలో గత తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించుకునే తరుణం ఇది. అనేక పథకాలు గుదిబండగా ఉన్నాయి. ఆర్థికంగా దెబ్బ తీస్తున్న పథకాలను సమీక్షించుకోవాలి. లేకుంటా ఖజానాపై మరింతగా తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే దండగ మారి పథకాలను సమీక్షించుకోవాలి. కిలో రూపాయి బియ్యం పథకం తక్షణం సవరించాలి. కొత్త కార్డులు ఇచ్చే ముందు పాతకార్డుల్లో ఎంతమంది అర్హులో తేల్చాలి. అలాగే రైతు భరోసాలో అనర్హులను కూడా తొలగించాలి. పెన్షన్ స్కీమ్‌ను 60 ఏళ్లనుంచే మొదలు పెట్టేలా కొనసాగించాలి. అందులోనూ అనర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలి. లేకుంటే ఇవన్నీ కూడా ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆరోగ్యశ్రీ ని అందుబాటులోకి తేవడం మంచిదే అయినా..క్షేత్రస్థాయిలో ఆస్పత్రులను కూడా బలోపేతం చేయాలి. గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పునరుద్దరించి పటిష్టం చేయాలి. చేపట్టిన పనిని చివరి వరకు వదలకుండా చేసే ధైర్యం, స్థయిర్యం ఉన్న సిఎంగా రేవంత్ పేరు తెచ్చు కోవాలి. ఆర్థిక సంస్కరణల్లోనూ ముందుండాలి. ఈ సారి కూడా రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చింది. అందుకు తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పంటల కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారు. ఇవన్నీ సమీక్షించుకుంటేనే ప్రజలకు మేలు చేసిన వారు అవుతారు. విత్తనాల కోసం పోరాడుతున్న వారికి స్వాంతన కలిగేలా తక్షణ చర్యలకు దిగాలి.

# కోరలు చాస్తోన్న కోవిడ్

న్యూఢిల్లీ,దేశంలో మరోసారి కరోనా మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. నిన్నామొన్నటి దాకా స్తబ్ధతగా ఉన్న కోవిడ్ తాజాగా మళ్లీ పడగ విప్పుతోంది. అనేక రాష్ట్రాల్లో మృత్యు ఘంటికలు మోగిస్తోంది. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 22 మంది చనిపోగా.. దేశ రాజధాని ఢిల్లీలో కోవిడ్ మృతుల సంఖ్య 3కి చేరింది. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 2, 700 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ప్రస్తుతం కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలో తీవ్ర నష్టం జరగడంతో వైద్య శాఖ అప్రమత్తమై.. జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రాలను అలర్ట్ చేసింది. గత వారం నుంచి ఒక్కసారిగా అమాంతంగా వెయ్యి కేసులు పెరిగిపోయాయి. ప్రస్తుతం కేరళలో 1,147 కేసులు నమోదు కాగా.. మహారాష్ట్రలో 424 కేసులు, ఢిల్లీలో 294 కేసులు, గుజరాత్‌లో 223 కేసులు, కర్నాటక, తమిళనాడులో 148 కేసులు, పశ్చిమ బెంగాల్‌లో 116 కేసులు నమోదయ్యాయి. కేరళలోనే ఎక్కువ ఇన్ఫెక్షన్లు ఉన్నట్లు- ఆరోగ్య మరియు కుటు-ంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజా డేటాలో పేర్కొంది. ఇప్పటిదాకా ప్రశాంతంగా కరోనా.. మే 25 నుంచి బాగా ఎక్కువగా ప్రభావం చూపిస్తోందని తెలిపింది. వారంలోనే 5 రెట్లు- పెరిగిపోయాయని చెప్పింది. గత 24 గంటల్లో దేశ వ్యాప్తంగా ఏడు మరణాలు నమోదైనట్లు- ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 22 మంది చనిపోయినట్లు- వెల్లడించింది. గత 24 గంటల్లో మహారాష్ట్రలో రెండు మరణాలు సంభవించగా.. గుజరాత్, కర్ణాటక, పంజాబ్ మరియు తమిళనాడులో ఒక్కొక్కటి చొప్పున మరణాలు సంభవించాయి. ఇక ఢిల్లీలో తాజాగా కోవిడ్‌తో ఇద్దరు చనిపోయారు. జనవరి నుంచి ఇప్పటి వరకు కరోనాతో చనిపోయిన సంఖ్య ఢిల్లీలో 3కు చేరింది. పేగు సంబంధమైన వ్యాధితో బాధపడుతున్న 60 ఏళ్ల మహిళ, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న 71 ఏళ్ల వృద్ధుడు ఢిల్లీలో చనిపోయినట్లు- అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే కోవిడ్ ప్రభావం తక్కువగానే ఉందని.. పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కేరళలో ఎక్కువగా పరీక్షలు నిర్వహించడం వల్లే అత్యధిక కేసులు నమోదవుతున్నాయని పేర్కొంది. ప్రస్తుతం లక్షణాలు సాధారణ ఫ్లూ లక్షణాలతో సమానంగా ఉన్నాయని.. కొన్ని లక్షణాల్లో జ్వరం, ముక్కు కారటం, గొంతు నొప్పి, తలనొప్పి, అలసట ఉన్నాయని చెప్పింది.

# పాక్ రెండు తలల పాము

డెన్మార్క్,పహల్గాం ఉగ్రదాడి అత్యంత పాశవికమని, యూరప్ చవిచూసిన కమ్యూనల్ టెర్రరిజం తరహా అనాగరిక చర్యని కేంద్ర మాజీ మంత్రి, అఖిల పక్ష ప్రతినిధి బృందం సభ్యుడు ఎంజే అక్బర్ అన్నారు. డెన్మార్క్ కోపెన్ హాగన్‌లో పర్యటిస్తున్న ఎంజే అక్బర్.. పాకిస్థాన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ దేశాన్ని విషపు నాగుతో పోల్చారు. పాక్ ప్రభుత్వానికి పాము వలే చీలిక నాలుక, రెండు తలలు ఉన్నాయని ఆగ్రహించారు. కోపెన్ హాగన్‌లో ఎన్ఐఆర్‌లతో అఖిలపక్ష ఎంపీల ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ ప్రతినిధి బృందానికి బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ సారథ్యం వహిస్తున్నారు.

# ఆయుధాల పందేరం!

## జెట్స్ కూలిపోవడం ముఖ్యమైన విషయం కాదు

న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత్ కొన్ని ఎయిర్ నష్టాలను చవిచూసినట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ శనివారం అంగీకరించారు. అయితే, భారత్‌కి చెందిన 6 ఫైటర్ జెట్స్‌ని కూల్చేశామనే పాకిస్తాన్ వాదనల్ని మాత్రం ఆయన తిరస్కరించారు. అవి పూర్తిగా తప్పు అని చెప్పారు. తొలిసారిగా, సైన్యం భారత్ కొన్ని విమానాలు కోల్పోయినట్లు ధ్రువీకరించింది. పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణల్లో మొదటి రోజు ఎయిర్ నష్టాలను చవిచూసిన తర్వాత భారత్ తన వ్యూహాలను మార్చుకుందని, మూడు రోజుల తర్వాత పోరుగురాని కాల్పుల విరమణ ప్రకటించే ముందు నిర్ణయాత్మక ఆధిక్యాన్ని స్థాపించిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ చెప్పారు. బ్లూమ్‌బెర్గ్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చౌహాన్ మాట్లాడుతూ.. జెట్స్ కూలిపోవడం ముఖ్యమైన విషయం కాదని, అవి ఎలా, ఎందుకు కూలిపోయాయన్నదే ముఖ్యమని చెప్పారు. తద్వారా సైన్యం తన వ్యూహాలను మెరుగు పరుచుకుని మళ్లీ దాడి చేయగలిగిందని చెప్పారు. మే మొదటి వారంలో ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత్ యుద్ధవిమానాలను కోల్పోయిందా అనే ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. మంచి విషయం ఏంటంటే, మేము చేసిన వ్యూహాత్మక తప్పులను అర్థం చేసుకున్నాము, సరిదిద్దుకున్నాము, రెండో రోజుల్లో తర్వాత దానిని మళ్లీ అమలు చేశాం. మేము మా అన్ని యుద్ధవిమానాలను సుదూర లక్ష్యాల వైపు నడిపామని అన్నారు. మే 7, 8, 10 తేదీల్లో పాకిస్తాన్ లోకి వెళ్లి వారి వైమానిక స్థావరాలపై ఖచ్చితమైన దాడులు నిర్వహించాం, మే 10న అన్ని రకాల ఆయుధాలతో అన్ని రకాల విమానాలను దాడులు చేశాయని చెప్పారు. అయితే, ఘర్షణ సమయంలో పాకిస్తాన్‌కి చైనా నుంచి వాస్తవ సహాయం లభించలేదని వెల్లడించారు. పాక్‌తో ఘర్షణ ఆగిపోయినప్పటికీ, మళ్లీ ఉగ్రదాడి జరిగితే భారత్ ఖచ్చితంగా నిర్ణయాత్మకంగా స్పందిస్తుందని ఆయన చెప్పారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ప్రస్తుతం ఆసియా-పసిఫిక్ భద్రతా శిఖరాగ్ర సమావేశమైన షాంగ్రిలా డైలాగ్‌కు హాజరవుతూ సింగపూర్‌లో ఉన్నారు. దీనికి ముందు, మే 11న జరిగిన మీడియా సమావేశంలో భారత వైమానిక దళం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్, ఎయిర్ మార్షల్ ఎకె భారతి, ఆపరేషన్ సిందూర్ సమయంలో విమాన నష్టాల గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, 'పోరాటంలో నష్టాలు ఒక భాగం' అని పేర్కొన్నారు, అయితే అన్ని ఐఏఎఫ్ పైలట్లు సురక్షితంగా ఇంటికి తిరిగి వచ్చారని ధ్రువీకరించారు. ఇదే విషయంపై భారత వాయుసేనలో డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ ఏకే భారతీ గతంలోనే స్పందించారు. నష్టం జరగడమనేది పోరాటంలో భాగమేనన్నారు. అయితే, వాయుసేన పైలెట్లందరూ సురక్షితంగా తిరిగి వచ్చారని చెప్పారు. తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ సిందూర్‌పై సాయుధ దళాలు ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఎయిర్ మార్షల్ ఈ విధంగా స్పందించిన సంగతి తెలిసిందే.

## పేపర్లను కూడా సక్రమంగా దిద్దించలేని అసమర్థులు

అమరావతి,టెన్త్ పరీక్షల నిర్వహణలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ పూర్తిగా ఫెయిల్ అయ్యారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. మీ పాలనలో విద్యారంగం భ్రష్టు పట్టిపోయిందని పేర్కొన్నారు. మీ అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే ఎదురవుతున్నాయని అన్నారు. 10వ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్నారని తీవ్రంగా విమర్శించారు.. మీరు మిగతా వ్యవస్థలను ఇంకా ఎంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోందని స్పష్టం చేశారు. 6.14 లక్షల మంది రాత్రీపగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించలేక పోయారని దుయ్యబట్టారు.. మీరు ఘోరంగా విఫలమై విద్యార్థులను, వారి తల్లిదండ్రులను క్షోభకు గురిచేశారని మండిపడ్డారు. ప్రతి స్టూడెంట్ కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తం చేసే పరిస్థితిని తీసుకు వచ్చారని.. మీరు చేసిన తప్పులు కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమైపోయిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.. 'చంద్రబాబు గారూ దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అసలు పరీక్షల నిర్వహణ సమయంలోనే మీ బేలతనం బయటపడింది. ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయి. అయినాసరే తప్పులను సరిదిద్దుకోకపోవడం మీ అసమర్థతకు నిదర్శనం కాదా? రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయిలో పోటీ-ని ఎదుర్కొనేలా తీసుకొచ్చిన అనేక సంస్కరణలను వచ్చీరాగానే దెబ్బతీశారు. స్కూళ్లలో నాడు-నేడు, గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు, 3వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా బోధన ఇలా ప్రతి మంచి కార్యక్రమాన్ని కక్షగట్టి నీరుగార్చారు. తల్లులను ప్రోత్సహిస్తూ ఇచ్చే అమ్మ ఒడిని రద్దుచేశారు. పరీక్షలు నిర్వహణ, ఫలితాల వెల్లడిలోనూ విఫలమవుతున్నారు. మీరు చేసిన తప్పుల వల్ల విద్యార్థులు బలైపోవడానికి వీల్లేదు. ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయండి. తుది ఫలితాలు వచ్చేంతవరకూ -టె-న్త్ మార్క్ప ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్నిరోజులపాటు- నిలిపివేయండి. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నానని జగన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## శశిథరూర్ దౌత్య విజయం..

## కొలంబియా సంతాప ప్రకటన వెనక్కు

న్యూఢిల్లీ,ఉగ్రవాదంపై పాక్ వైఖరిని ఎండగడుతూ కొలంబియాలో పర్యటిస్తున్న భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందం దౌత్యం ఫలించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపిన కొలంబియా ప్రభుత్వం తాజాగా యూటర్న్ తీసుకుంది. పాక్‌కు తెలియజేసిన సంతాప ప్రకటనను వెనక్కి తీసుకుంది. దీనిపై కొలంబియా టీమ్‌కు సారథ్యం వహిస్తున్న కాంగ్రెస్ నేత శశిథరూర్ సంతోషం వ్యక్తం చేసింది. అప్పట్లో పాక్‌కు సంతాపం తెలుపుతూ కొలంబియా చేసిన ప్రకటనపై శశిథరూర్ అసహనం వ్యక్తం చేశారు. శశిథరూర్ బృందం తమ పర్యటనలో భాగంగా కొలంబియా విదేశాంగ ఉప మంత్రి రోసా యెలాండ్ విల్లావెసెన్సియోతో భేటీ- అయింది. పహల్గాం ఉగ్రదాడి, భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ వివరాలను సమగ్రంగా తెలియజేసింది. దీంతో పరిస్థితులపై తమకు పూర్తి అవగాహన వచ్చినట్టు- యెలాండ్ ప్రకటించారు. పాక్‌పై చేసిన ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్టు- తెలిపారు. కొలంబియా నిర్ణయంపై గన్ క్లబ్‌లో జరిగిన ది కొలంబియా కౌన్సిల్ ఆన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, సెలెక్ట్ పొలిటికల్ అనాలసిస్ట్ అండ్ డిప÷-లొమేట్స్ సమావేశంలో శశిథరూర్ కృతజ్ఞతలు తెలిపారు.



న్యూఢిల్లీ,రాజ్యాంగాన్ని మనం అమలు చేసుకోవటం మొదలెట్టి 75 ఏళ్లవుతుండగా మన పాలకుల విపరీత పోకడలు దాన్ని కాస్తా భ్రష్టుపట్టించే దిశగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని సరిహద్దులకు సమీపంగా వుండే మారుమూల ప్రాంతాల్లోని స్థానిక తెగలకూ, నివాసితులకూ ఆయుధాల లైసెన్స్‌లుమంజూరు చేయాలని అస్సాం మంత్రివర్గం బుధవారం నిర్ణయించటం ఆ కోవలోనిదే. సరిహద్దు ఆవలి నుంచి చొరబడి బెదిరింపులకు దిగేవారి నుంచి రక్షణ కోసం, వ్యక్తిగత భద్రత కోసం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెబుతున్నారు. 'జాతి, నేల, స్థానికత' కాపాడటం కోసమే ఇలా చేస్తున్నామని ఆయన ప్రకటించారు. బంగ్లాదేశ్ పొడవునావుండే రెండు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల వాసులకు ఈ ఆయుధాల లైసెన్స్‌లు లభిస్తా యని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాలన్నిటా ముస్లింల జనాభా ఎక్కువ. ఇప్పుడు జనం చేతికి తుపాకులందితే మత ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా తుపాకులు మాట్లాడటం మొదలవుతుంది. ఇది ప్రభుత్వానికి మంచిదేనా? 1985 నుంచీ ఆ ప్రాంతాలవారు ఈ లైసెన్స్‌ల కోసం డిమాండ్ చేస్తుంటే గత ప్రభుత్వాలేవీ సాహసించలేదని, వాటికి ధైర్యంలేదని శర్మ వివరిస్తున్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకొనేది తమకు రక్షణ, భద్రత కల్పిస్తాయని, మౌలిక సదుపాయల కల్పనపై శ్రద్ధ పెడతాయని, తమ బతుకులు మెరుగుపరచటానికి అవసరమైన పథకాలు రూపొందిస్తాయని ఆశించబట్టే! ఇంతకూ 'ధైర్యం లేని' గత ప్రభుత్వాల్లో తాను మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్, బీజేపీ ప్రభు త్వాలున్నట్టేనా? ఆ కాలాల్లోని ప్రభుత్వాలకు 'ధైర్యం' కలిగించేందుకు తాను చేసిందేమిటి? తాను విఫలమైన పక్షంలో దానిపై నిలదీయకుండా మౌనంగా ఎందుకు ఉండిపోయినట్టు? దాదాపు పాతికేళ్లుగా శర్మ రాజకీయాల్లో వుంటున్నారు. ఆయన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల్లో కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 2015లో కాంగ్రెస్ నుంచి తప్పుకోవటానికి కూడా కారణం ఆ సర్కార్‌కు ధైర్యం లేదని కాదు. తన రాజకీయ ఎదుగుదలకు అప్పటి సీఎం తరుణ్ గొగోయ్ అడ్డంకిగా మారటం! దీన్నంతటినీ రాహుల్‌గాంధీని కలిసి మొరపెట్టుకోవాలని శర్మతీవ్రంగా ప్రయత్నించారు. కానీ జనాదరణగల యువ నాయకుల కన్నా పీఠాధిపత్యం నెరపే వృద్ధ తరం నేతలకే పెద్దపీట వేసే సంస్కృతిగల కాంగ్రెస్‌లో అది సాధ్యపడలేదు. నేపథ్యం ఏమైనా బీజేపీలో శర్మ బాగా రాణించారు. ఏనాటినుంచో ఆ పార్టీలో వున్న నేతలను తలదన్నే విధంగా ప్రకటనలిచ్చి వివాదాస్పదుడూ అయ్యారు. అందువల్ల పార్టీలో ఆయన పట్టు పెరిగింది గనుకే 2021లో బీజేపీ అధిష్ఠానం శర్మను అస్సాం ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. కానీ గత ప్రభుత్వాలు తుపాకీ లైసెన్స్‌లు ఇవ్వకపోవటానికి వాటికి ధైర్యం లేకపోబట్టే అని ఆయన దేని ఆధారంగా నిర్ణయానికొచ్చారో చెప్పలేదు. శర్మ చెబుతున్న ప్రకారం ఆ ప్రభుత్వాలు సాహసించలేక పోబట్టి చాలామంది స్థానిక తెగలవారు బయటి వ్యక్తుల ఒత్తిళ్లకు లొంగి భూములు అమ్ముకోవాల్సి వచ్చింది. అక్కణ్ణించి వలసలు పోవాల్సి వచ్చింది. మరి ప్రభుత్వాల వైఖరి వల్ల జనం ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ఆయన మౌనంగా మిగిలిపోవటం ఎందువల్ల? హిమంత గ్రహించాల్సిన విషయం ఒకటుంది. గతంలో ప్రజల నుంచి ఎన్ని డిమాండ్లు వచ్చినా అప్పటి ప్రభుత్వాలు ఆయుధ లైసెన్సులివ్వకపోవటానికి కారణం ధైర్యం లోపించి కాదు. అది అనైతికమూ, రాజ్యాంగ విరుద్ధమూ అని విశ్వసించటం వల్ల! అమెరికాలో పౌరులెవరైనా ఆయు ధాలు కొనుక్కోవచ్చు. అందుకు కొన్ని నిబంధనలున్నా ఆచరణలో అవి ఏమవుతున్నాయో అక్కడ తరచు జరిగే ఉదంతాలు గమనిస్తే అర్థమవుతుంది. అక్కడ సగటున 100 మంది పౌరులకూ 120.5 తుపాకులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. నిరుడు తుపాకీ మరణాలు 30,000 మించాయి. అకారణంగా లేదా భయపడి తరచు అవతలివారిని చంపుతున్న ఉదంతాలు ఎక్కువ. ఆ దేశంలో కూడా హిమంత ప్రభుత్వం ఏకరువు పెడుతున్న నిబంధల వంటివే వున్నాయి. మానసికంగా సక్ర మంగా వుండి అవతలివారి నుంచి ప్రాణభయం ఉన్న 21 ఏళ్లు పైబడినవారందరికీ లైసెన్సులిస్తా మని హిమంత చెబుతున్నారు. ఏదైనా కేసులో శిక్షపడినా, శాంతికి దోహదపడతామని గతంలో ప్రభుత్వానికి బాండు రాసిచ్చినా అనర్హులవుతారట. అంతేగాక మానసికంగా, శారీరకంగా సరైన స్థితిలో వున్నవారికే లైసెన్సులు జారీచేస్తారట. ఒకసారంటూ కళ్లెం వదిలాక ఇవన్నీ నిజాయతీగా, చిత్తశుద్ధిగా అమలవుతాయా? అనుమానమే!అస్సాం మొదటినుంచీ సమస్యాత్మక రాష్ట్రం. అక్రమంగా చొరబడిన విదేశీయులను వెనక్కిపంపాలంటూ ఉవ్వెత్తున లేచిన విద్యార్థి ఉద్యమం, అటుతర్వాత ఉల్ఫా లాంటి ఉగ్రవాద సంస్థల ఆగడాలు తెలియంది కాదు. నిత్యం అపహరణలు, డబ్బు దండుకోవటం, హత్యలు ఒకప్పుడు చాలా అధికం. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాన్లు, పోలీసులు ఉల్ఫా ఆటకట్టించాక అవి చాలావరకూ తగ్గిపోయాయి. ఇప్పటికీ బీఎస్ఎఫ్ జవాన్లు సరిహద్దుల్లో నిత్యం పహారా కాస్తుంటారు. సమస్య వుందనుకుంటే మరింతమందిని నియమించి, పటిష్ఠమైన పర్యవేక్షణ అమలు చేయటం పెద్ద కష్టం కాదు. అందుకు భిన్నంగా లైసెన్సులిస్తామంటే ప్రభుత్వం చేతులెత్తేసినట్టు కాదా? ఇలాంటి కారణాల వల్లే గతంలో ఛత్తీస్‌గఢ్‌లో సుప్రీంకోర్టు సల్వాజుడుంను రద్దుచేసింది. పైగా అస్సాంకు భారీయెత్తున పెట్టుబడులు తీసుకొస్తామని చెబుతూ శాంతికి విఘాతం కలిగించే ఇలాంటి విధానం అమలు చేయటం సరైందేనా? హిమంత ఆలోచించాలి.

# కృత్రిమ మేధ కట్టుతప్పితే...



హైదరాబాద్,అచ్చం మనిషిలాగా ఆలోచించే, అర్థం చేసుకునే, మాట్లాడే సామర్థ్యాలను కృత్రిమ మేధ వేగంగా అందిపుచ్చుకుంటోంది. ఏఐ చాట్‌బోట్‌తో సంభాషిస్తున్నా- సాటి వ్యక్తితోనే మాట్లాడుతున్నామనే భావన కలుగుతోంది! ఇలాంటి పరిణామాలు మంచికా, చెడుకా? మనిషికి, యంత్రానికి మధ్య గీత చెరిగిపోవడం సరికొత్త సామాజిక సమస్యలకు దారితీస్తుందా? టెక్ సంస్థలు, ప్రభుత్వాల ముందున్న బాధ్యతేంటి? అచ్చం మనిషిలాగా ఆలోచించే, అర్థం చేసుకునే, మాట్లాడే సామర్థ్యాలను కృత్రిమ మేధ వేగంగా అందిపుచ్చుకుంటోంది. ఏఐ చాట్‌బోట్‌తో సంభాషిస్తున్నా- సాటి వ్యక్తితోనే మాట్లాడుతున్నామనే భావన కలుగుతోంది! ఇలాంటి పరిణామాలు మంచికా, చెడుకా? మనిషికి, యంత్రానికి మధ్య గీత చెరిగిపోవడం సరికొత్త సామాజిక సమస్యలకు దారితీస్తుందా? టెక్ సంస్థలు, ప్రభుత్వాల ముందున్న బాధ్యతేంటి? సూపర్ కంప్యూటర్ల గురించి ఎంతో విన్నాం. సైన్స్ సినిమాలు ఎన్నో చూశాం. ఈ కథలన్నీ సాంకేతికతను చాలా శక్తిమంతమైనదిగా ఆవిష్కరించాయి. కానీ, మనిషి స్వభావాన్ని, ఆలోచనలను మాత్రం యంత్రం ఎప్పటికీ అందిపుచ్చుకోలేదనే భావన కలిగించాయి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. సూపర్ కంప్యూటర్ల బదులు సూపర్ కమ్యూనికేటర్ల శకం మొదలైంది. మన భావోద్వేగాలు, ఆలోచనలను కృత్రిమ మేధ(ఏఐ) అర్థం చేసుకోగలదు. మనం ఎలాంటి సమయంలో, ఎటువంటి మాటలు వినాలని అనుకుంటున్నామో అంచనా వేయగలదు. అత్యంత సావధానంగా, సహానుభూతితో సంభాషిస్తూ- మన ఆప్తమిత్రుణ్ని తలపించగలదు. అసలు మనం మాట్లాడుతోంది ఏఐతోనా, లేదా మనిషితోనా అని గుర్తించలేని పరిస్థితి దాదాపుగా ఏర్పడింది! ఇలా యంత్రాలు మానవ మేధోశక్తిని కనబరచడాన్ని 'ఆంత్రోపోమార్ఫిజం'గా వ్యవహరిస్తారు. బ్రిటిష్ గణిత, కంప్యూటర్ శాస్త్రవేత్త అలాన్ ట్యూరింగ్ దీనిపై అనేక పరిశోధనలు చేశారు. మనిషి అంత తెలివిగా కంప్యూటర్ ఆలోచించగలదా అని తేల్చేందుకు 1950లో ఆయన 'ట్యూరింగ్ పరీక్ష'ను ప్రతిపాదించారు. ఆ పరీక్షలో ఇప్పటి ఏఐ ఉత్తీర్ణత సాధించగలగుతుంది. మనసులను తాకేలా రాయడంలో మనుషులతో పోల్చితే కృత్రిమ మేధ అద్భుత పనితీరు కనబరుస్తోందని అనేక అధ్యయనాల్లో తేలింది.

### విప్లవాత్మక మార్పులు

ఏఐలో అత్యంత కీలకమైన లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్ఎల్ఎమ్స్) ఒక్కో వ్యక్తి మేధోశక్తిని అంచనా వేసి, వారికి సులువుగా అర్థమయ్యే రీతిలో సంభాషించడంలో దిట్ట. ఈ సామర్థ్యం ఇటీవల కస్టమర్ కేర్ రంగంలో విప్లవాత్మక మార్పులకు కారణమైంది. అనేక సంస్థలు ఇప్పటికే కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బోట్ల ద్వారా వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు యత్నిస్తున్నాయి. టెలికం, బ్యాంకింగ్, ఈ-కామర్స్, న్యాయ, వైద్య, విద్య రంగాల్లో ఏఐ హవా పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో ఒకేసారి లక్షల మందికి పాఠాలు బోధించే ఎడ్‌టెక్ వేదికలు- ప్రతి విద్యార్థి సందేహాలనూ విడివిడిగా నివృత్తి చేయగలుగుతున్నాయంటే, అందుకు కారణం ఏఐనే. ఒంటరితనం ఆలోచనలతో బాధపడే లక్షలాది మందికీ కృత్రిమ మేధ తోడుగా నిలుస్తోంది. వారి మాటలు ఓపికగా వింటోంది. ఎవరూ లేరనే భావనను తొలగించేలా కబుర్లు చెబుతోంది.

అయితే, ఏఐ కంపానియన్ యాప్‌లు యువతపై తీవ్ర దుష్ప్రభావాలు చూపిస్తున్నాయనే వాదనలు ఉన్నాయి. మనుషులను మించి 'ప్రేమ'ను ఒలికించేలా మాటలు చెప్పే ఏఐ టూల్స్‌ను యూజర్లు అతిగా విశ్వసిస్తున్నారు. తమ వ్యక్తిగత సమాచారం వెల్లడికి ఏమాత్రం వెనుకాడటం లేదు. అయితే, ఇది మున్ముందు ఎలాంటి సమస్యలకు దారితీస్తుందనేది అసలు ప్రశ్న.

### మోసగించే ముప్పు

కృత్రిమ మేధ పూర్తిస్థాయిలో మనిషిని అనుకరించడం వల్ల అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మనం ఇచ్చే సమాచారం ఆధారంగానే ఎల్ఎల్ఎమ్స్ కొత్త విషయాలు నేర్చుకుంటాయి. అంటే- జాతి, లింగం, రూపం, వయసుకు సంబంధించి మనుషుల్లో ఉండే వివక్ష, మూస ఆలోచనలనూ ఏఐ అందిపుచ్చుకుంటుంది. వాటినే క్రమంగా వాస్తవాలన్నట్లుగా ప్రవర్తిస్తుంది! ఏఐని యూజర్లు అతిగా విశ్వసించడం మరో పెద్ద సమస్య. స్నేహపూర్వకంగా, మనిషిని తలపించేలా సంభాషించే చాట్‌బోట్- సలహాలను (అవి తప్పయినా) మనుషులు పాటించే అవకాశం 20శాతం అధికమని 2023లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన పరిశోధనలో తేలింది. ఆర్థిక, వైద్య రంగాల్లో ఇలాగే ఏఐ సలహాలు పాటించడం వల్ల జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులనేది అస్పష్టం. హృదయాన్ని తాకేలా సంభాషించగల ఏఐని అసత్యాల వ్యాప్తికి, ప్రజలను మోసగించేందుకు ఉపయోగించే ప్రమాదమూ పొంచి ఉంది. ఇప్పటికే డీప్‌ఫేక్ వాయిస్ స్కామ్‌ల బారినపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మరోవైపు, కొన్ని ఏఐ సంస్థలు- యూజర్లు అడిగిన సమాచారంతోపాటు ప్రొడక్ట్ రికమండేషన్ కూడా చేస్తున్నాయి. క్రమంగా ఈ పద్ధతిని మరింత మోసపూరితంగా మార్చి, ఒక వస్తువు విక్రయాలను పెంచుకునే వక్ర మార్గంగా ఎంచుకునే అవకాశమూ లేకపోలేదు.

### నియంత్రణ అవసరం

'మనిషిలాంటి ఏఐ' రెండు వైపులా పదును ఉన్న కత్తి. సాంకేతికతతో మాత్రమే కాకుండా సమాజంతో ముడిపడి ఉన్న కీలకాంశం. సమతూకం పాటిస్తూ ఈ అస్త్రాన్ని ఉపయోగించుకోవడం పెను సవాలు. ఒకవేళ మనిషిలా ఆలోచించే శక్తి లేకుండా చేస్తే- కృత్రిమ మేధ ప్రత్యేకతను కోల్పోతుంది. ఏఐతో పెద్దగా ఉపయోగం లేకుండా పోవచ్చు. అలా అని వదిలేస్తే- అసత్యాల వ్యాప్తి, మోసాలు, అసమానతలు పెరిగేందుకు కారణమవుతుంది. నియంత్రణ కొరవడిన మేధ సహజరీతిలో కాకుండా, కృత్రిమంగానే పనిచేస్తుందన్న సంగతిని గుర్తించాలి. ఇలాంటి సమస్యలను నివారించడం, మంచీచెడుల మధ్య సమతూకం సాధించడం టెక్ సంస్థలు, ప్రభుత్వాల ముందున్న తక్షణ కర్తవ్యం. ఏఐ టూల్స్ పనితీరును ఎప్పటికప్పుడు పరీక్షించడం, నియంత్రణకు స్పష్టమైన మార్గదర్శకాలు తీసుకురావడం ఇందుకు మార్గాలు. ఈ విషయంలో టెక్ సంస్థలు పారదర్శకంగా వ్యవహరించాలి. ఆకట్టుకునే ఫీచర్లను జోడించడం మాత్రమే కాదు, నైతిక విలువలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. 'ఇది ఏఐ సృష్టించిన సమాచారం' అని యూజర్లకు వివరించాలి. ఐరోపా సమాఖ్య ఏఐ చట్టంలో ఈ నిబంధనను స్పష్టంగా పొందుపరిచింది. అయితే, ఇక్కడ టెక్ సంస్థల స్వీయ ప్రకటనలు, ప్రభుత్వాల మార్గదర్శకాలతోపాటు యూజర్ల విచక్షణ కూడా అత్యంత కీలకమన్న సంగతి గుర్తించాలి. కృత్రిమ మేధ చేసే సంభాషణ చాతుర్యానికి ముగ్ధులై, ఆ మాటలను, వివరాలనే గుడ్డిగా నమ్మేయకుండా, ఏఐ ఇచ్చే సమాచారాన్ని పూర్తిగా విశ్లేషించుకుని, ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమం.

## పాక్ 600 డ్రోన్ల ప్రయోగం..అన్నింటినీ కూల్చేశాం

అహ్మదాబాద్,ఆపరేషన్ సిందూర్ (సమయంలో పాకిస్థాన్ 600కు పైగా డ్రోన్లు ప్రయోగించినట్టు- బీఎస్ఎఫ్ గుజరాత్ ఐజీ అభిషేక్ పాఠక్ సంచలన విషయం వెల్లడించారు. అయితే వాటన్నింటినీ భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు విజయవంతంగా కూల్చేసినట్టు చెప్పారు. పౌరులకు కానీ, సెక్యూరిటీ సిబ్బందికి కానీ ఎలాంటి హాని కలుగకుండా డిఫెన్స్ మెకానిజం అద్భుత పనితీరు

## చార్‌ధామ్ యాత్రకు భారీగా భక్తుల రాక

డెహ్రాడూన్,ఉత్తరాఖండ్ ఛార్‌ధామ్ యాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. చార్‌ధామ్, దేశవ్యాప్తంగానే కాకుండా విదేశీ భక్తులు ఏటా ఎంతో ఆసక్తిగా తరలివస్తుంటారు. ఈ యాత్రను హిందువులు ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా చార్‌ధామ్ యాత్ర చేయాలనుకుంటారు. ఈ సీజన్‌లో చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి గత 30 రోజుల్లో 16 లక్షల మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ ఏడాది కేదార్‌నాథ్ యాత్రకు రద్దీ పెరిగింది. మే 2న ఆలయ తలుపులు తెరుచుకున్నప్పటి నుంచి ఇంతవరకూ 6.5 లక్షల మంది కేదార్‌నాథ్‌ను దర్శించారు. గంగోత్రి, యమునోత్రి ధామ్‌లు అక్షయ తృతీయ పవిత్రదినాన తెరుకుకోవడంతో చార్‌ధామ్ యాత్ర అధికారికంగా ఏప్రిల్ 30న ప్రారంభమైంది. కేదార్‌నాథ్ ధామ్ మే 2న, బద్రీనాథ్ ధామ్ మే 4న తెరుచుకున్నాయి. ఈ ఆలయాలు ప్రతి సంవత్సరం ఆరు నెలలే తెరిచి ఉంటాయి. శీతాకాలం అక్టోబర్-నవంబర్‌లో మూతపడి ఏప్రిల్-మే÷-లో తెరుస్తుంటారు. హిందువులు అత్యంత పవిత్రమైన యాత్రల్లో ఒకటిగా చార్‌ధామ్ యాత్రను హిందువులు భావిస్తుంటారు. యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాధ్‌ను చుట్టిరావడాన్ని చార్‌ధామ్ యాత్ర అంటారు. క్లాక్‌వైజ్‌లో యాత్ర సాగిస్తుంటారు. యమునోత్రితో మొదలై ఆ తర్వాత గంగోత్రి, కేదార్‌నాథ్ మీదుగా సాగుతూ బద్రీనాథ్‌తో యాత్ర ముగుస్తుంది. ఏప్రిల్-మే, అక్టోబర్-నవంబర్ మధ్య భక్తులు ఈ యాత్రలను చేపడుతుంటారు.

## ఉద్దేశ్యపూర్వకంగానే వంశీని జైలులో పెట్టారు

మచిలీపట్నం, గడిచిన 115 రోజులుగా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఉద్దేశ్యపూర్వకంగా జైలులో ఉంచారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఎలాగైనా ఆయన్ని ఇబ్బందులు పెట్టాలని కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.. కృష్ణా జిల్లా వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించిన పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఒక కేసులో బెయిలు వస్తుందంటే మరో కొత్త కేసు నమోదు చేస్తున్నారన్నారు.. కేసు మీద కేసు అంటూ తప్పుడు కేసులు పెడుతున్నారని.. వంశీ విషయంలో దేవుడు ఉన్నాడు.. న్యాయస్థానాల్లో అంతిమంగా న్యాయం గెలుస్తుందనే నమ్మకంతో ఉన్నామన్నారు. చివరికి కూటమి ప్రభుత్వం దిగజారి మానవత్వం కూడా మరచి ఆరోగ్యాన్ని క్షీణింప జేయాలని దుర్బుద్ధితో ఇంత తతంగం నడుపుతున్నారని విమర్శించారు.. గతంలో చంద్రబాబు జైలుకు వెళ్లగానే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి.. అచ్చెన్నాయుడు పైల్స్ వస్తాయి.. వంశీ విషయంలో మాత్రం కోర్టుల నుంచి అనుమతులు తెచ్చుకోవాల్సి వచ్చిందని తీవ్రంగా విమర్శలు గుప్పించారు.. ఏదో రకంగా బలి చేయాలని కస్టడీల మీద కస్టడీలకు తీసుకుంటు-న్నారన్నారు..ఆయన పరిస్థితి విషమించి కింద పడిపోయినా ఆరోగ్యం బాగానే ఉందని అని సర్టిఫికెట్ తీసుకుంటు-న్నారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు.. 'అచ్చెన్నాయుడు మాత్రం పైల్స్ కోసం రమేష్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటారు.. చంద్రబాబు బాగాలేదని బెయిల్ తెచ్చుకుని బయటకు వచ్చి ఒక్కరోజు కూడా ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోలేదు.. బయటకు వచ్చాక రాజకీయాలు మానలేదు.. చంద్రబాబు నాయుడు, లోకేష్ నాయుడు యముడి పాత్రలో ఉంటే సతీ సావిత్రి పాత్రలో వంశీ భార్య పోరాటం చేస్తుంది.. ఈ తప్పుడు కేసుల్లో మహా అయితే ఇంకొక పది రోజులు జైలులో పెట్టగలరు.. వంశీ బయటకు వస్తాడు.. గన్నవరం నుంచే తన పోరాటాన్ని చేస్తాడు.. గన్నవరం వచ్చి కార్యకర్తలకు ధైర్యం చెప్పాలని వచ్చాం.. ఇక్కడి కార్యకర్తలు మాత్రం వంశీ అండగా ఉండే పరిస్థితి ఇక్కడ కనిపిస్తుంది.. అరచేతిలో వైకుంఠం చూపించిన చంద్రబాబు ప్రజలను దగా చేశారు.. నాడు ఎన్టీఆర్ కు ఎలా వెన్నుపోటు- పొడిచారో మోసపు హామీలతో ఏపీ ప్రజలను మోసం చేస్తున్నారు.. ప్రజలకు ఒక్క హామీ కూడా నెరవేర్చిండా రాజకీయాలు చేస్తున్నారు.. ఇలాంటి పాలకులను ఎన్నుకోవటం రాష్ట్ర ప్రజల దురదృష్టం.. గన్నవరం లోనే మిన్నగా వెన్నుపోటు- కార్యక్రమం చేస్తాం.. ప్రభుత్వ ఆస్పత్రిలో ఇచ్చినవి మొత్తం తప్పుడు రిపోర్టులు అని అర్థమైంది..' అని మాజీ మంత్రి వ్యాఖ్యానించారు.ధర్మంగా వైద్యం చేయాల్సిన వైద్యులు తప్పుడు రిపోర్టులు ఇచ్చారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు.. హైకోర్టు న్యాయస్థానం వల్లే ఆయన ప్రాణాలతో బయటకు రాగలిగే పరిస్థితి.. 5న ఆయుష్ ఆస్పత్రి న్యాయస్థానానికి హెల్త్ బులెటిన్ ఇస్తుందన్నారు.. వంశీని కుట్రలు, కుతంత్రాలతో తుదముట్టించేందుకు చంద్రబాబు, లోకేష్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు..

## తెర పైకి కొత్త చర్చ!

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుట్ల కవిత మరో సంచలనానికి తెర తీశారు. బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేసే ప్రయత్నాలు జరుగున్నాయని మీడియా చిట్ చాట్ లో చెప్పారు. నిజానికి మై డియర్ డాడీ అంటూ కేసీఆర్ కు రాసిన, లేఖలోనూ కవిత, బీజేపీ, బీఆర్ఎస్ సంబంధాలని ప్రస్తావించారు. వరంగల్ రజతోత్సవ సభలో కేసీఆర్ బీజేపీ పట్ల కొంత మెతక వైఖరి అవలంబించారనే అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. బీజేపీని గట్టిగా తిట్టకపోతే.. బీజేపీ, బీఆర్ఎస్ కలుస్తాయనే తప్పుడుసంకేతాలు ప్రజల్లోకి వెళతాయని అంటూ.. కేసీఆర్ తమ ప్రసంగంలో కేవలం రెండు నిముషాలు మాత్రమే బీజేపీని టార్గెట్ చేయడాన్ని నెగటివ్ పాయింట్స్ లో చేర్చారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఏకంగా బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న కొత్త చర్చను తెర పైకి తెచ్చారు. అయితే.. కవిత లేఖలో పేర్కొన్న అంశాలలో కొంత నిజం ఉన్నా.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది ఎలా చూసిన అయ్యే పని కాదని పరిశీలకులు అంటున్నారు. నిజానికి కేసీఆర్ బీఆర్ఎస్ ను బీజేపీలోనే కాదు, కాంగ్రెస్ సహా మరే పార్టీలోనూ విలీనం చేయరని.. ఒక్క ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన పార్టీ అస్తిత్వాన్ని చంపుకునే తప్పు కేసీఆర్ చేయరని ఆయన సన్నిహితులు అంటున్నారు. నిజానికి.. గతంలో ఉద్యమ సమయంలోనూ కేసీఆర్ తెలంగాణ సాధించుకునే వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ ముందు విలీనం ప్రతిపాదనను ఉంచారని.. ఒక పావుగా మాత్రమే విలీనం ప్రతిపాదన చేశారని కేసీఆర్ మాజీ మిత్రులు అంటున్నారు. అయితే.. బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశాలను మాత్రం కొట్టి వేయలేమని మాజీ మిత్రులతో పాటుగా, ప్రస్తుత పరిణామాలను దగ్గరగా చూస్తున్న రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. నిజానికి.. ప్రస్తుత పరిస్థితిలో బీఆర్ఎస్, బీజేపీ ఎన్నికల పొత్తు ఉభయ తారకంగా రెండు పార్టీలకూ లాభ దాయకంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులతో పాటుగా ఉభయ పార్టీలలో ఒక వర్గం గట్టిగా భావిస్తోంది. అయితే.. అదే సమయంలో రెండు పార్టీలలోనూ కూడా పొత్తు వద్దనే వాదన కూడ అంతే బలంగా వినిపిస్తోందని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల ఫలితాలను, ఉభయ పార్టీల ఓటు షేర్ లో వస్తున్న మార్పును గమనిస్తే..

# జ్యోతి మల్హోత్ర, భయ్యా సన్నీ యాదవ్‌ను కలిపి విచారిస్తున్న ఎన్ఐఏ..!



న్యూఢిల్లీ,వారం రోజులైనా యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ జాడ తెలియలేదు. చెన్నై ఎయిర్ పోర్ట్ లో దిగగానే యూట్యూబర్ సన్నీని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చెన్నైలో రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.జ్యోతి మల్హోత్ర, సన్నీలను కలిపి ఎన్ఐఏ విచారిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పటికే మల్హోత్ర అరెస్టు చేసి జైలుకు పంపారు. వారం రోజులైనా సన్నీ యాదవ్ తమ దగ్గర ఉన్నాడని ఎన్ఐఏ చెప్పడం లేదు. పాకిస్థాన్లో వీడియోలు చేసి దుబాయ్ మీదుగా చెన్నైకి చేరుకున్నాడు భయ్యా సన్నీ యాదవ్.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నవారితో సమావేశమైన వీడియోలు బయటికి వచ్చాయి. ఇతడితో సంబంధాలు ఉన్న వాళ్ళతో సమావేశంపై ఆరా తీస్తోంది ఎన్ఐఏ.కాగా.. రెండ్రోల కిందట సన్నీ యాదవ్ తండ్రి రవీందర్ ఎన్టీవీతో మాట్లాడారు. భయ్యా సన్నీ యాదవ్ ను చెన్నైలో అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. సన్నీ యాదవ్ స్నేహితుడు చెర్రీని ఇంట్లో 29న గుర్తుతెలియని వ్యక్తులు అదుపులోకి తీసుకున్నారు. కొద్దిరోజుల క్రితం సెంట్రల్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు మా ఇంటికి కూడా వచ్చారన్నారు. కొన్ని పత్రాలు పరిశీలించారని మరికొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారని వెల్లడించారు. మా అబ్బాయికి ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవు. సన్నీ యాదవ్ దేశ భక్తుడు.. పాకిస్తాన్ కు కేవలం బైక్ రైడర్ గానే వెళ్ళాడు.. పహల్గాం ఘటనకు ముందే పాకిస్తాన్ టూర్ కంప్లీట్ చేసుకుని వచ్చాడని తెలిపాడు. ఎవరు, ఎందుకు అదుపులోకి తీసుకున్నారో చెప్తే.. నేను కూడా వారికి సహకరిస్తానని తెలిపాడు. మా అబ్బాయి ఆచూకీ చెప్పాలి. లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని తెలిపాడు.

# సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ.. ఈసారి మాత్రం..?

హైదరాబాద్, సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. జీహెచ్ఎంసీలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత సీఎంకి లేఖ రాశారు'గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలంలో చేపట్టాల్సిన ఎమర్జెన్సీ పనుల టెండర్లలో కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉన్న సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. తెలంగాణకు చెందిన బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేసేలా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారు. ఒక విదేశీ సంస్థకు చెందిన వాహనాలు మాత్రమే ఈ పనుల కోసం వినియోగించేలా నిబంధనలు రూపొందించారు' అని లేఖలో పేర్కొన్నారు.'ఆ సంస్థకు హైదరాబాద్ రెండు షోరూంలు మాత్రమే ఉన్నాయి.. ఆ షోరూంల నిర్వాహకులు తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్లతో ఎంఓయూ చేసుకునేందుకు ససేమిరా అంటున్నారు.. తెలంగాణ కాంట్రాక్టర్లు కర్నాటక షోరూంల డీలర్ల నుంచి ఎంవోయూలు తెచ్చుకున్నా వాటి ఫిజికల్ కాపీలు తక్కువ వ్యవధిలో తెచ్చి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీలోని 150 వార్డులకు వేర్వేరుగా టెండర్లు పిలిచేవారు.. ఇప్పుడు తొమ్మిది జోన్‌ల వారీగా మాత్రమే టెండర్లు పిలవడంతో తెలంగాణ కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతోంది' అని వారి సమస్యల గురించి రాసుకొచ్చారు.'అధికారులు పేర్కొన్న స్పెసిఫికేషన్స్ కూడిన వాహనాల్లో ఒక



క్యూబిక్ మీటర్ మెటీరియల్ కూడా తరలించడం సాధ్యం కాదు.. గతంలో ఇందుకు వినియోగించిన వాహనాల్లో రెండు నుంచి మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్ తరలించేవారు. అధికారులు ఒక సంస్థకు, రెండు కాంట్రాక్టు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చేలా నిబంధనలు మార్చడంతో ఒక్కో ఏడాదికి రూ. 5.85 కోట్ల అదనపు భారం పడుతుంది. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి.. గతంలో మాదిరిగా వార్డుల వారీగా టెండర్లు పిలిస్తే 150 మంది స్థానిక కాంట్రాక్టర్లకు ఉపాధి లభిస్తుంది.. మున్సిపల్ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన శాఖలో జరుగుతోన్న అక్రమాలపై దృష్టి సారించి వెంటనే చర్యలు చేపట్టాలి' అని కవిత లేఖలో పేర్కొన్నారు.

# పట్టువీడలేదు... పదవి దక్కేనా!

చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నల్లారి కుటుంబం అంటే తెలియని వారు లేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి గా పని చేసిన కిరణ్ కుమార్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కు ఎంత మేలు చేసారో నేటికి చాల మంది మరచిపోయి ఉండరు. సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో పార్టీ ఏర్పాటు చేసి తరువాత అన్నింటినీ పక్కన పెట్టిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి ప్రస్తుతం బీజేపీ నుంచి ఓ పెద్ద పదవి వరించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తండ్రి అమర్నాథ్ రెడ్డి వాయల్పాడు నియోజకవర్గం ఎమ్మెల్యే గా మృతి చెందారు. అమర్నాథ్ రెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు 1978 ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీ ఫారం ఇచ్చారు. ఆయన మరణంతో కిరణ్ కుమార్ రెడ్డి తల్లి ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైంది. 1989లో తొలిసారి ఎమ్మెల్యే.. ఆ తరువాత ఓటమి చవి చూసారు. అనంతరం 1999, 2004, 2009 ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చీఫ్ విప్ గా, స్పీకర్ గా కూడా పదవులు అధిరోహించారు. కిరణ్ కుమార్ రెడ్డి మంచి క్రికెటర్ , అజహరుద్దీన్ తో కలసి వివిధ స్థాయిల్లో క్రికెట్ ఆడారు. తండ్రి అమర్ నాథ్ రెడ్డి మరణంతో రాజకీయాల్లోకి అనివార్యంగా ప్రవేశించారు. నిజాం కాలేజీలో నందమూరి బాలకృష్ణ.. కిరణ్ కుమార్ రెడ్డి కలిసి చదువుకున్నారు. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2010 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రి గా పని చేశారు.ఆయన సొంత పార్టీ పెట్టి ఓటమి పాలైన తరువాత గత ఎన్నికల వరకు ఎక్కడ పెద్దగా కనిపించలేదు.2024 ఎన్నికల్లో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ తరుపున రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. తన ప్రత్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పై పోటీ చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి తన వాక్చాతుర్యం తో రాజంపేట పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తూ వైసీపీ నాయకులకు నిద్ర లేకుండా చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై విమర్శలు చేస్తూ ముందుకు సాగారు. పెద్దిరెడ్డి సైతం కిరణ్ కుమార్ రెడ్డి కామెంట్స్ పై స్పందించే రీతిలో



ప్రసంగించారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తో జిల్లా రాజకీయాల్లో ఢీ అంటే ఢీ అంటూ పైచేయి సాధించారు. గత ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ నుండి కిరణ్ కుమార్ రెడ్డి స్వల్ప మెజారిటీతో ఓటమి పాలైన.. తన తమ్ముడు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ని పీలేరు ఎమ్మెల్యే గా గెలిపించారు. పావు నరసింహారావు ఆశీస్సులతో ఎప్పటికైనా ముఖ్యమంత్రి కావాలనే కోరిక కిరణ్ కుమార్ రెడ్డి తండ్రికి ఉన్నా అది నెరవేరలేదు... తండ్రిఆశయాన్ని కిరణ్ కుమార్ రెడ్డి నెరవేర్చారు. తన ఇంట్లో అధికారం ఉన్నా లేకపోయినా నియోజకవర్గంలో అభివృద్ధి, నియోజకవర్గ ప్రజలకు దగ్గరగా ఉంటూ వస్తున్నారు. నేటికి నియోజకవర్గ పర్యటనలు చేస్తున్నారు. తమ ఇంటి గడప వద్దకు వచ్చి ఏమి కావాలనే అడిగితే అది జరుగుతుంది అన్నది నియోజకవర్గ ప్రజల మాట. కిరణ్ కుమార్ రెడ్డి అనుభవం దృష్ట్యా బీజేపీ పార్టీ ఆయనకు అత్యున్నత స్థాయి పదవి ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.

# 'రేషన్'వార్.. కూటమి వర్సెస్ వైసీపీ..!



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ వాహనాలను తొలగించారు.. ఇంటింటికి తీసుకొచ్చి వాహనాల్లో రేషన్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా నష్టం వస్తుందని కూటమి ప్రభుత్వం వీటిని తొలగించింది..వీటి స్థానంలో రేషన్ షాపులోనే ఇకనుంచి రేషన్ ఇవ్వనున్నారు. ప్రతి నెల 15 రోజులు పాటు రేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం రెడీ అవుతోంది.. 65 ఏళ్లు దాటిన వృద్ధులు.. దివ్యాంగులకు ఇంటి వద్దకు తెచ్చి ప్రతి నెల 5వ తేదీ లోపు రేషన్ అందిస్తారు.. ఇకనుంచి రేషన్ దుకాణాలను రేషన్ మాల్స్ గా మార్చి మిగిలిన వస్తువులు కూడా అందించడానికి ప్రభుత్వం రెడీ అవుతోంది..గత ప్రభుత్వం పై పౌర సఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రమైన విమర్శలు చేశారు.. గత ప్రభుత్వం రేషన్ వాహనాలను ఉపయోగించడం వల్ల 1700 కోట్లకు పైగా నష్టం వచ్చింది అన్నారు.. అదే విధంగా రేషన్ వాహనాల్లో మాఫియా వల్ల అక్రమ బియ్యం తరలింపు ఆస్కారం కలిగిందన్నారు.. రేషన్ వాహనాలు ఎప్పుడు వచ్చేవో కూడా తెలిసేది కాదన్నారు.. ఏదో ఒక మూల వాహనాన్ని పెట్టి కొంతమందికి రేషన్ ఇచ్చి వెళ్లిపోయే వారిని విమర్శలు చేశారు.. దీంతో ఖజానాకు నష్టం కాకుండా అక్రమ బియ్యం తరలింపు అస్కారాలు ఏర్పడింది అన్నారు నాదెండ్ల మనోహర్.అయితే, రేషన్ వాహనాలు తొలగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వైసీపీ తీవ్ర స్థాయిలో మండిపడింది.. వృద్ధులకు వికలాంగులకు దివ్యాంగులకు ఈ నిర్ణయం వల్ల తీవ్రమైన ఇబ్బంది కలుగుతుంది అన్నారు మాజీ మంత్రి, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ . ప్రభుత్వం తీసుకున్న అనాలోచితం నిర్ణయాల వల్ల నష్టం జరుగుతుందన్నారు.. మరో మాజీ మంత్రి అంబటి రాంబాబు కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.. రేషన్ వాహనాల్లో డ్రైవర్లు 70 నెలల కోసం గత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు అని.. అర్థాంతరంగా తొలగించడం ఎంతవరకు సమంజసం అన్నారు. గత ప్రభుత్వం లో బియ్యం అక్రమ రవాణా జరిగిందని అనవసర విమర్శలు చేయడం మంచిది కాదన్నారు అంబటి రాంబాబు%‰% సీఎం చంద్రబాబు రేషన్ వాహన దారులను సంఘ విద్రోహ శక్తులుగా చూడడం ఏంటి అని ఆవేదన వ్యక్తం చేశారు అంబటి.. కూటమిలో ఎమ్మెల్యేలు బియ్యం అక్రమ రవాణాలో ఉన్నారని.. నాదెండ్ల మనోహర్ మొదటి స్మగ్లర్ అంటూ ఆరోపణలు చేశారు అంబటి రాంబాబు.. మొత్తానికి రేషన్ వ్యవహారం టీడీపీ వైసీపీ మధ్య మాటల యుద్ధాన్ని పెంచింది.. ఇప్పటికే రేషన్ వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.. మరి రేషన్ దుకాణాలలో మళ్లీ రేషన్ ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంత వరకు మేలు జరుగుతుందో చూడాలి మరి.

# ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు..25 మంది మృతి



న్యూఢిల్లీ,ఈశాన్య రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదలు, కొండచరియలు విరిగి పడుతుండటంతో మూడు రాష్ట్రాలు విలవిల్లడుతున్నాయి. ఫలితంగా మూడు రాష్ట్రాల్లో25 మంది వరకు మరణించారు. అస్సాం రాజధాని గౌహతి లో మట్టి కూరుకుపోయి ఐదుగురు మరణించారు. మణిపూర్‌లో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు వల్ల ఇంఫాల్ నగరం జీవితం స్తంభించింది. ఇంఫాల్ నది ఒడ్డున నివసిస్తున్నవారు పునరావాస కేంద్రాలకు తరలిపోవాలని అధికారులు సూచించారు. సిక్కింలోని వివిధ ప్రాంతాల్లో 1,500 మంది పర్యాటకులు చిక్కుకు పోయారు. గల్లంతయిన 8 మంది పర్యాటకుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలకు వర్షాల వల్ల ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో 9 మంది చనిపోయారు. ఈస్ట్ కామెంగ్ జిల్లాలో శుక్రవారం రాత్రి ఓ వాహనం లోయలోకి కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దిగువ సుబాన్‌సిరి జిల్లాలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. గువాహటిలో ఒక్క రోజే 111 మి.మీ వర్షం పడింది. 67 ఏళ్లలో ఇదే రికార్డు వర్షపాతం అని అధికారులు వెల్లడించారు.

### లైంగిక వేధింపులతో బాలిక ఆత్మహత్యాయత్నం

మచిలీపట్నం,70 ఏళ్ల వృద్ధ ఉపాధ్యాయుడు ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. శారీరకంగా తనకు సహకరించాలంటూ ఆ ఉపాధ్యాయుడు బాలికపై ఒత్తిడి తెచ్చాడు. ఆయన వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్యాయత్నం చేసింది. తల్లిదండ్రులు సరైన సమయంలో గుర్తించటంతో.. ప్రాణాలతో బయటపడింది. ఇక, ఈ ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ శైలజ రాయపాటి స్పందించారు.

# ఏడాది విపక్ష నేతగా జగన్ కి ఎన్ని మార్కులు ?

అమరావతి,ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం మరి కొద్ది రోజులలో ఏడాది పాలన పూర్తి చేసుకోబోతోంది. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం ప్రమాణం చేసింది. దాంతో అయిదేళ్ల ప్రజల తీర్పులో ఒక ఏడాది గడచింది. ఈ ఏడాదిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏమీ చేయలేదని ఆరోపిస్తూ వైసీపీ ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4న తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తోంది.అంటే ఏడాది కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ఈ నిరసనలు అన్న మాట. విపక్ష పార్టీగా వైసీపీకి ఆ హక్కు ఉంది. అదే సమయంలో ఏ ప్రభుత్వంలో అయినా లోపాలు ఉంటాయి. అలాగే కొన్ని చేయగలరు, కొన్ని చేయలేకపోతారు. దాంతో విపక్షం మాత్రం విమర్శలకు ఎదురుచూస్తుంటుంది కాబట్టి కచ్చితంగా దానిని వాడుకుంటుంది.మరి విపక్ష నేతగా జగన్ కి కూడా తొలి ఏడాది ఎలా గడచింది. ఆయన పెర్ఫార్మెన్స్ ఎలా ఉంది. ఆయన ఈ ఏడాదితో ప్రజల పక్షాన నిలబడి చేసిన పోరాటాలు ఎన్ని ఉన్నాయన్నది కూడా చర్చకు వస్తోంది. ఏపీ ప్రజలు 2024 ఎన్నికల్లో విభిన్నమైన తీర్పు ఇచ్చారు. 164 సీట్లు కూటమికి ఇచ్చిన వారు కేవలం 11 సీట్లు మాత్రమే వైసీపీకి ఇచ్చారు. అలా విపక్ష హోదా లేని నేతగా జగన్ ని ఉంచారు. ఇది జగన్ మొత్తం పొలిటికల్ కెరీర్ లో వింత అనుభవం. ఆయనకు విపక్ష పాత్ర కొత్త కాదు కానీ హోదా లేని పాత్ర మాత్రం ఇదే కావడంతో ఆయన చాలా కొత్తగానే ఫీల్ అవుతూ వచ్చారు.ఆయన వెనక పది మంది మాత్రమే ఎమ్మెల్యేల బలాన్ని ఇచ్చి బలమైన కూటమి ప్రభుత్వం మీద పోరాడమని జనాలు ఒక సందేశం ఇచ్చారు. అయితే జగన్ మాత్రం ఈ ఏడాదిలో అసెంబ్లీకి పోలేదు, తనకు విపక్ష హోదా కావాలని ఆయన కోరుతూ వచ్చారు. దాని మీద కోర్టుకు వెళ్ళారు.ఇక ఈ ఏడాదితో తన పార్టీ వారి చేత కొన్ని నిరసన కార్యక్రమాలు చేయించారు. తాను మాత్రం ఎక్కడా పాల్గొనలేదు. అతి తక్కువ సందర్భాలలో మాత్రమే ఆయన జనంలోకి వచ్చారు. అది కూడా పరామర్శలకే పరిమితం అయ్యారు.కూటమి ప్రభుత్వానికి జగన్ ఏకంగా ఏడాది పాటు హనీమూన్ పీరియడ్ గా ఇచ్చేశారు. అలా విపక్ష నేతగా జగన్ అనుకున్న స్థాయిలో పనిచేయలేదా అన్న చర్చ అయితే ఉంది. ఆయన జనంలోకి రాకుండా ఉండడమే కాదు బెంగళూరు టూ తాడేపల్లి షటిల్ సర్వీస్ చేస్తూ గడిపారు.ఈ లెక్క తీసుకుంటే కనుక ఆయన ఏడాదిలో దాదాపుగా సగం రోజుల పాటు బెంగళూరులోనే ఉన్నారని భావించాలని అంటున్నారు. మరో వైపు చూస్తే జగన్



మీడియా సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అవి కూడా ఎక్కువగా అయితే లేవు. తనకు నచ్చినపుడు మాత్రమే మీడియాను పిలిచి ప్రభుత్వం మీద కామెంట్స్ చేస్తూ వచ్చారు.ఆ విధంగా జగన్ మీడియా ముఖంగానే విపక్ష పాత్ర పోషించారు. తొలి ఏడాది సూపర్ సిక్స్ హామీలు అమలు కాలేదని వైసీపీ ఆరోపిస్తోంది. అందుకే వెన్నుపోటు దినం అని చెబుతోంది. కానీ ప్రభుత్వం మీద పెట్టాల్సిన ఒత్తిడి ఒక విపక్ష పార్టీగా వైసీపీ ఎంతవరకూ పెట్టింది అన్నది కూడా చర్చకు వస్తోంది.ప్రజా స్వామ్యంలో ఎవరి బాధ్యతలు వారికి ఉంటాయి. అధికార పార్టీ పాలన చేయాలి. అందులో తప్పులు ఉంటే ప్రజా ప్రక్షాన నిలబడి విపక్షం వాటిని ఎత్తి చూపాలి. నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాల్సి ఉంటుంది. కానీ వైసీపీ అధినేత మాత్రం ఆ పాత్ర పోషణలో ఎందుకో అంత చురుకుగా ఈ ఏడాది కాలంలో వ్యవహరించలేదు అని అంటున్నారు. అందుకే వైసీపీ గ్రాఫ్ కూడా అనుకున్నంతగా పెరగలేదు అని అంటున్నారు.మరో వైపు చూస్తే వైసీపీలో సైతం నిరాశాజనకంగా ఏడాది పాటు సాగింది. అంతా బయటకు వెళ్ళిపోయే వారు తప్ప ఉండే వారు ఎవరు అన్న చర్చ కూడా సాగింది. పునాది లాంటి విజయసాయిరెడ్డి పార్టీని వీడడం మాత్రం పెద్ద షాక్ గానే చెబుతున్నారు. ఏది ఏమైనా కూటమి పాలనను విమర్శిస్తున్న వైసీపీ అదే సమయంలో విపక్షంలో ఉన్న తన పాత్రను తన రాజకీయ ప్రదర్శనను కూడా ఆత్మ విమర్శ చేసుకుంటే బాగుంటుంది అన్న సూచనలు వస్తున్నాయి.

# మాట నిలబెట్టుకున్న మంత్రి సీతక్క

హైదరాబాద్,రాజకీయం అంటే ప్రత్యర్థులపై కేసులు, ప్రతీకార చర్యలు, కక్ష సాధింపులుగా మారిపోయిన నేటి రోజులలో ఓ నాయకురాలు మాత్రం అందుకు భిన్నంగా నిలిచారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకుడు చేసిన సేవలను గుర్తించి ఒక మండలానికి ఏకంగా ఆయన పేరునే ప్రతిపాదించి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఔను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రి సీతక్క ప్రతిపాదనను గౌరవించి ఓ మండలానికి ప్రతిపక్ష పార్టీ నాయకుడి పేరు పెట్టింది. ములుగు జిల్లాలో కొత్తగా ఏర్పడిన మల్లంపల్లి మండలం పేరును జేడీ మల్లంపల్లిగా రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేస్తూ శనివారం (మే 31) గెజిట్ విడుదలైంది. ఇంతకీ జేడీ ఏమిటంటారా. ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు. జడ్పీ మాజీ అధ్యక్షుడు దివంగత కుసుమ జగదీష్. బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు మల్లంపల్లిని మండ లంగా ప్రకటించాలంటూ కుసుమ జగదీష్ తీవ్రంగా ప్రయత్నించారు. అయితే అప్పట్లో అది సాధ్యం కాలేదు. కానీ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత మల్లంపల్లిని మండలంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా కుసుమ జగదీష్ ఇటీవల మరణించారు. ఆ సమయంలో కుసుమ జగదీష్ కు నివాళులర్పించిన సీతక్క. మల్లంపల్లి మండలానికి ఆయన పేరు పెడతామనీ, ఇందుకు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట నిలబెట్టుకున్నారు.కుసుమ జగదీష్ సేవలకు గుర్తింపుగా మల్లంపల్లి మండలానికి ఆయన పేరు పెట్టాలన్న మంత్రి సీతక్క



ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మల్లంపల్లి మండలానికి ఆయన పేరు చేరుస్తూ జేడీ మల్లంపల్లిగా మారుస్తూ గెజిట్ విడుదల చేసింది. రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన నేత పేరును మండలానికి పెట్టడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఇందుకు కృషి చేసిన మంత్రి సీతక్క రాజకీయాలలో విలువలకు పెద్ద పీట వేశారంటూ మల్లంపల్లి మండల సాధన సమితి సభ్యులు, ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

# పాక్ ప్రయోగించిన "టర్కీ బైరక్తర్ డ్రోన్ వలయాన్ని" భారత్ ఎలా ఛేదించింది..?



న్యూఢిల్లీ, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ పంపిన డ్రోన్లను భారత్ అడ్డుకుంది. వందల సంఖ్యలో పాకిస్తాన్ పంపిన డ్రోన్లు మన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థవంతంగా అడ్డుకుంది.టర్కీకి చెందిన అత్యంత ప్రసిద్ధి చెందిన బైరెక్టర్ TB2 డ్రోన్ వలయాన్ని భారత్ విజయవంతంగా ఛేదించింది. ఒక్క డ్రోన్ కూడా తన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. భారత స్వదేశీ తయారీ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ "ఆకాష్ తీర్" వ్యవస్థ టర్కిష్ డ్రోన్లను కూల్చేసింది.ఇంటెలిజెంట్ వార్‌ఫేర్ సామర్థ్యాలు, ఆకాష్‌తీర్ వ్యవస్థ రియల్‌టైమ్, ఆటోమేటెడ్ వాయు రక్షణ యుద్ధంలో భారతదేశ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.ఆకాష్టీర్ విస్తృత C4ISR (కమాండ్, కంట్రోల్,కమ్యూనికేషన్స్,కంప్యూటర్స్, ఇంటెలిజెన్స్, సర్వైలెన్స్ మరియు రికనైసెన్స్) ఫ్రేమ్‌వర్క్‌లో భాగం.ఇతర వ్యవస్థలతో సమన్వయ ం చేసుకుంటూ పనిచేస్తుంది. భారత్–పాక్ ఉద్రిక్తతల మధ్య టర్కిష్ డ్రోన్ ముప్పును ఆకాష్ తీర్ సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు సీనియర్ ఆర్మీ అధికారులు చెబుతున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com